RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 137 శుక్రవారం 13 జూన్ 2025 పేజీలు : 4

### బంగ్లాదేశ్ ఎగుమతులు భారత్ నుంచి వెళ్లకుండా నిషేధం

న్యూఢిల్లీ : భారత భూభాగం గుండా నేపాల్, భూటాన్, మయన్మార్ దేశాలకు సరుకులు ఎగుమతి చేసుకునేలా బంగ్లాదేశ్‌కు గతంలో ఇచ్చిన వెసులు బాటు(ట్రాన్స్‌షిపమెంట్)ను కేంద్రప్రభుత్వం రద్దు చేసింది. బంగ్లాదేశ్ ఎగుమతులేవీ భారతదేశం గుండా వేరే దేశాలకు వెళ్లకుండా పూర్తిగా నిషేధం విధించింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. బంగ్లాదేశ్‌కు ట్రాన్స్‌షిపమెంట్ వెసులుబాటు కల్పిస్తూ 2020 జూన్ 29న భారత్ సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం.. బంగ్లాదేశ్ తమ ఉత్పత్తులను భారత్‌లోని ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్లు, నౌకాశ్రయాలు, ఎయిర్‌పోర్టుల ద్వారా వేరే దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చు.



# నష్టం జరగక ముందే అప్రమత్తమవ్వండి...!

## భారీ వర్షాలు, వరద ముప్పుపై సమీక్షించిన మంత్రి పొంగులేటి

### ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా జాగ్రత్త పడాలని అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

హైదరాబాద్ : ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణ కంటే ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గోదావరి కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వీలైనంతవరకు ప్రాణ, ఆస్తి, ఆర్థిక నష్టం జరగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లతో గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి పొంగులేటి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించేదానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్రస్థాయిలో వరద ప్రభావిత ప్రాంతాలలో చేపట్టవలసిన చర్యలు, విపత్తుల నిర్వహణ విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డీజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, ఆరోగ్య శాఖల కమిషనర్లతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని.. ఆ నివేదిక ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు.

**గతేడాదికి మించి వర్షాలు పడే ఛాన్స్...** ఈ ఏడాది వర్షాకాల సీజన్ అనుకున్నదానికంటే 15 రోజుల ముందుగానే వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాలతో సమన్వయం చేసుకొని ప్రకృతి వైపరీత్యాల ప్రభావం వీలైనంత వరకు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పొంగులేటి సూచించారు. గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రదేశాలలో జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో హఠాత్తుగా వచ్చే వర్షాలతో ఊహించని వరదలు వస్తున్నాయని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు.

నిర్వాసితులను గుర్తించి వారిని అక్కడి నుంచి శాశ్వతంగా తరలించి వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది పరివాహక ప్రాంతాల్లో తక్కువ సమయంలో ఎక్కువ వర్షం పడడం వల్ల నష్టం ఎక్కువగా జరిగిందని.. ఈసారి కూడా అటువంటి పరిస్థితి ఎదురైతే నష్టాన్ని తగ్గించే విధంగా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

**మూస పద్ధతికి స్వస్తి చెప్పండి..** రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ మూస పద్ధతికి స్వస్తి చెప్పి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేయాలని పొంగులేటి ఆదేశించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు, నిర్వహణ, ముందస్తు హెచ్చరికల కోసం అవసరమైన యూజర్ ఐడీలను ఇవ్వాలని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఆయా జిల్లాల్లో పరిస్థితులను బట్టి వరదల కార్యాచరణ ప్రణాళికలను ఈనెల 30వ తేదీలోగా తయారు చేసుకోవాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆపద మిత్ర వాలంటీర్స్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సహాయంతో సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వరద నియంత్రణ కట్టలు, చిన్న-మధ్య తరహా కాల్వలు, వర్షపు నీటి డ్రెయిన్‌లు మొదలైన వాటిని పరిశీలించి రిపేర్లు చేయించాలన్నారు. రిలీఫ్ క్యాంపుల ప్రదేశాలు, సంప్రదించవలసిన నెంబర్లు మొదలైనవి ఉండాలన్నారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, అత్యవసర, పొడి ఆహార కిట్లు ముందే సిద్ధంగా ఉంచాలన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య శాఖల సామాన్యంతో పనిచేయాలని కంట్రోల్ రూములు ప్రారంభించాలని అత్యధిక ప్రమాద ప్రాంతాలలో స్థానిక రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. మొబైల్ వైద్య బృందాలు, అవసరమైన మందులు, నీటి శుద్ధి మాత్రలు, పారిశుధ్య కిట్లు వంటివి తగిన మొత్తంలో అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ హరీష్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమిషనర్ సృజన, సీపీ డీసీఎల్ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి.గోపి, ఐఎండీ అధికారి నాగరత్నం, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల్, ములుగు, నిర్మల్, వనపర్తి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.




హైదరాబాద్: తెలంగాణలో 36 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్.శ్రీధర్ - పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి. గనులశాఖ ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు. లోకేశ్ కుమార్- రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి. నవీన్ మిత్తల్- ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి. జ్యోతి బుద్ధప్రకాష్ -ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి. శశాంక్ గోయెల్ -

### భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు

దిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్. హరిచందన దాసరి- హైదరాబాద్ కలెక్టర్ . రాజీవ్‌గాంధీ హనుమంతు- రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రటరీ, ఐజీ. భారతి లక్‌పతి నాయక్ - సమాచార శాఖ కమిషన్ కార్యదర్శి. కిల్లు శివకుమార్ నాయుడు -ఆర్అండ్ఆర్ కమిషనర్. చిట్టెం లక్ష్మి - సాధారణ పరిపాలన విభాగం సంయుక్త కార్యదర్శి. ఇ.నవీన్ నికోలస్ - స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్. టి.వినయ్ కృష్ణారెడ్డి- నిజామాబాద్ కలెక్టర్. సృజన- మహిళాశిశుసంక్షేమశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు. ఎల్.శివశంకర్- వ్యవసాయ సహకార శాఖసంయుక్త కార్యదర్శి, విపత్తు నిర్వహణ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు. కె.హైమావతి- సిద్దిపేట కలెక్టర్. పి.గౌతమ్- సింగరేణి డైరెక్టర్. వాసం వెంకటేశ్వర్‌రెడ్డి- ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ డైరెక్టర్. కె.నిఖిల- మత్స్యశాఖ డైరెక్టర్. వల్లూరు క్రాంతి- పర్యాటకశాఖ ఎండీ. పి.ఉదయ్ కుమార్- ఆరోగ్యశ్రీ హెల్త్ ట్రస్ట్ సీఈవో. ప్రియాంక ఆల- టీజీపీఎస్సీ కార్యదర్శి. పి.ప్రావిణ్య- సంగారెడ్డి కలెక్టర్. మిక్కిలినేని మను చౌదరి- మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్. అనుదీప్ దురిశెట్టి- ఖమ్మం కలెక్టర్. స్నేహ శబరీష్- హనుమకొండ కలెక్టర్. ముజామిల్ ఖాన్- పౌరసరఫరాలశాఖ డైరెక్టర్.



### ఈనెల 14న గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవం

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవం ఈనెల 14న జరగనుంది. ఈ మేరకు టీఎఫ్డీసీ ఛైర్మన్ దిల్ రాజు మీడియాకు వివరాలు అందించారు. అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాద నేపథ్యంలో ఈ మీడియా సమావేశానికి పలువురు మంత్రులు హాజరు కాలేకపోయారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా ఈ అవార్డులు అందిస్తున్నామని తెలిపిన దిల్ రాజు.. ఈనెల 14న సాయంత్రం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ వేడుక జరుగుతుందని వెల్లడించారు. 2014 నుంచి 2023 వరకు ఎన్నికైన ఒక్కో ఉత్తమ చిత్రానికి ఉత్తమ హీరో, హీరోయిన్, డైరెక్టర్, ప్రొడ్యూసర్ లు మొత్తం నాలుగు అవార్డులు అందుకుంటారని తెలిపారు. 14 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ వేడుకలకు అందరూ హాజరై, విజయవంతం చేయాలని దిల్ రాజు కోరారు.

## అహ్మదాబాద్‌లో కూలిన ఎయిరిండియా విమానం!

# గాల్లో కలిసిన ప్రాణాలు!

### మృతుల్లో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, 7 పోర్చుగీస్, ఒకరు కెనడియన్, 12 మంది విమాన సిబ్బంది




గాంధీనగర్, జూన్ 12: అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మొత్తం 242 మంది మరణించారు. ఈ జాబితాలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, 7 పోర్చుగీస్, ఒకరు కెనడియన్, 12 మంది విమాన సిబ్బంది ఉన్నారు. ఈ విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాని సైతం మరణించారు.

**50 మృతదేహాలు..** మరోవైపు 50 మృతదేహాలను విమాన శకలాల నుంచి వెలికి తీశారు. సహాయక చర్యలు కొనసాగుతోన్నాయి. ఎయిర్ పోర్ట్ నుంచి బయలుదేరే అన్ని విమానాలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎయిర్ పోర్టు అధికారులు ప్రకటించారు.

**మాజీ సీఎం విజయ్ రూపానీ..** ఇంకోవైపు ఈ విమానంలో ప్రయాణిస్తున్న గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ మరణించారు. ఆయన కుమార్తె లండన్‌లో నివసిస్తుంది. ఈ నేపథ్యలంలో ఆమె వద్దకు వెళ్లేందుకు ఆయన లండన్ ప్రయాణమయ్యారు. ఇక ఆయన భార్య అంజలి రూపానీ లండన్‌లో ఉన్నారు. ఆమెను తీసుకు వచ్చేందుకు ఆయన లండన్ పయనమైనట్లు విజయ్ రూపానీ కుటుంబ సభ్యులు వివరించారు.

**230 మందిప్రయాణికులు, 12 మంది సిబ్బంది..** అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన విమానంలో మొత్తం 230 మంది ప్రయాణికులు ఉన్నారు. మరో 12 మంది విమాన సిబ్బంది ఉన్నారు. వీరంతా ఈ ప్రమాదంలో మరణించారు. ఫ్లైట్ రాడార్ 24 ప్రకారం విమానం 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయింది. ఈ క్రమంలో మధ్యాహ్నం 1.39 సమయంలో పూర్తిగా కిందకు దిగిపోయి చెట్టును ఢీకొన్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి గురైన విమానం వైడ్‌బాడీ బోయింగ్ 787 డ్రీమ్ లైనర్. దీనిలో 300 మంది ప్రయాణించవచ్చు. ఇది 11 ఏళ్లుగా సేవలు అందిస్తోంది. సుదూర ప్రయాణం కావడంతో విమానంలో ఇంధనం కూడా భారీ ఉండటంతో.. ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. విమాన కూలిన విషయం తెలియగానే ఫైర్ ఇంజిన్లు ఆ ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఆ విమానంలో ఉన్నట్లు ఏబీపీ పత్రిక పేర్కొంది. ఈ ప్రమాదం విషయం తెలియడంతో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఘటనా స్థలానికి బయల్దేరారు. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి తెలుసుకొన్నారు. ఈ ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) స్పందించింది. విమానానికి కెప్టెన్‌గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్‌గా క్లైవ్ కుందర్ వ్యవహరించినట్లు పేర్కొంది. సుమిత్‌కు ఎల్‌టీసీగా 8,200 గంటలు, కోపైలట్‌కు 1,100 గంటల అనుభవం ఉన్నట్లు వెల్లడించింది. ఏటీసీ నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ విమానం రన్‌వే 23 నుంచి గాల్లోకి ఎగిరినట్లు తెలిపింది. కొద్ది సేపటికే ఆ ఎయిర్ క్రాఫ్ట్ నుంచి ఏటీసీకి మేడేకాల్ (అత్యవసర కాల్) వచ్చిందని వెల్లడించింది. ఆ తర్వాత కూలిపోయినట్లు పేర్కొంది. మరోవైపు ఎయిర్ ఇండియా కూడా ఎక్స్ వేదికగా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతో పాటు ఒక కెనడా వాసి ఉన్నట్లు వెల్లడించింది. ఈ ప్రమాదంపై సమాచారం కోసం హాట్‌లైన్ నెంబర్ 1800 5691 444 ఏర్పాటు చేసినట్లు తెలిపింది. తమ సామాజిక మాధ్యమం, ఎయిర్ఇండియా వెబ్‌సైట్‌లో కూడా ప్రమాద వివరాలు, అప్‌డేట్లు ఉంటాయని పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే తదుపరి ప్రకటన వెలువడే వరకు అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ఫ్లైట్ ఆపరేషన్స్‌ను సస్పెండ్ చేశారు.

# సంపాదకీయం

## పుతిన్ వచ్చాకే వైరం పెరిగిందా?

### అమెరికా రష్యా సంబంధాల వెనుక అసలు కథ!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధానం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. దీని కారణంగా గ్లోబల్ స్టాక్ మార్కెట్ నష్టాల్లోకి వెళుతోంది. ఈ విధానం వల్ల భారత్, చైనా వంటి అనేక దేశాలు ఇబ్బందుల్లో పడ్డాయి. టారిఫ్ కారణంగా రష్యా కూడా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రష్యా ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా చమురు, గ్యాస్, ఖనిజాల ఎగుమతులపై ఆధారపడి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఒకానొక సమయంలో అమెరికా రష్యాపై ఆంక్షలు విధించింది.

అందుకే ఈ రెండు దేశాలు ఒకరితో ఒకరు వ్యాపారం చేసుకోవు.

**అమెరికా, రష్యా ఎందుకు శత్రువులు?...** అమెరికా, రష్యా మధ్య శత్రుత్వం ఈనాటిది కాదు. ఉక్రెయిన్ యుద్ధం కావచ్చు లేదా రెండవ ప్రపంచ యుద్ధం కావచ్చు. అమెరికా, రష్యా సంబంధాలు ఎల్లప్పుడూ ఉద్రిక్తంగానే ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో సోవియట్ యూనియన్, అమెరికా మధ్య కూడా తీవ్రమైన విభేదాలు ఉన్నాయి. అందుకే ఈ రెండు దేశాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థితికి చేరుకున్నాయి. సోవియట్ యూనియన్ కాలంలోనే రెండు దేశాల మధ్య వైరం పెరగడంతో ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయింది. ఒకటి అమెరికా, యూరప్, బ్రిటన్ కలిసి నాటోగా ఏర్పడగా, మరొకటి తూర్పు యూరప్‌తో కలిసి వార్సా ఒప్పందం కింద ఏర్పడింది.

**పుతిన్ రాకతో మరింత పెరిగిన వైరం...** అమెరికా, రష్యా మధ్య వైరం చాలా సంవత్సరాలుగా ఉన్నప్పటికీ, వ్లాదిమిర్ పుతిన్ అధికారం చేపట్టిన తర్వాత అది మరింత పెరిగింది. ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు ఎంతగా దిగజారాయంటే, అమెరికా రష్యాపై అనేక రకాల ఆంక్షలు విధించింది. మరోవైపు రష్యా కూడా అనేకసార్లు అమెరికాపై అణ్వాయుధ దాడి చేస్తామని బెదిరించింది.

**అమెరికా, రష్యా వ్యాపారం చేసుకోరా?...** అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం ప్రకారం, 2024లో అమెరికా, రష్యా మధ్య వాణిజ్యం $3.5 బిలియన్లు (2.7 బిలియన్లు). ఇందులో ప్రధానంగా ఎరువులు, అణు ఇంధనం, కొన్ని లోహాలు ఉన్నాయి. అమెరికా, రష్యా మధ్య వాణిజ్యం నిలిచిపోయినప్పటికీ, కొన్ని ముఖ్యమైన వస్తువుల విషయంలో నేటికీ దిగుమతులు, ఎగుమతులు జరుగుతున్నాయి. కానీ చాలా వస్తువులపై అమెరికా రష్యాపై నిషేధం విధించింది.

## కల్వలకు గండి.. మరమ్మతులకు ఎన్నాళ్లండి ?

శంకరపట్నం: శంకరపట్నం మండలం కల్వల ప్రాజెక్టు ద్వారా శంకరపట్నం, వీణవంక మండలాలకు సాగు నీరందుతోంది. ఈ ప్రాజెక్టు కింద 2040 ఎకరాలు సాగవుతాయి. ప్రాజెక్టు ఎగువ, దిగువన అనధికారికంగా సుమారు 10 వేల ఎకరాలకు సరిపడా సాగు నీటి లభ్యత ఉంటుంది. 2023 జులైలో కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వరద పోటెత్తడంతో మత్తడి వద్ద భారీ గండి పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు మరమ్మతులపై యంత్రాంగం దృష్టి సారించడం లేదని.. వచ్చే నెలలో వర్షాలకు కురిస్తే తమ ఆయకట్టు పరిస్థితి ఏంటని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పూడ్చకుంటే మళ్లీ కన్నీరే**

గండి పడిన తర్వాత రూ.7 లక్షల నిధులతో తాత్కాలిక రింగ్‌బండ్ నిర్మాణం చేపట్టినా వరద ధాటికి తెగిపోయింది. ఆయకట్టు రైతులు తమ భాగస్వామ్యంతో సాగు నీటి అవసరాల కోసం రూ.6 లక్షలు వెచ్చించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ముందుకు సాగారు. వరి పైర్లు చివరి దశలో ఉన్న సమయంలో ఎస్సారెస్పీ నీరు ప్రాజెక్టులోకి భారీగా చేరటంతో రింగ్‌బండ్ మళ్లీ ధ్వంసమైంది. ఆ సమయంలో పంటలను కాపాడుకోవటానికి రైతులు అనేక కష్టాలు పడ్డారు.

శాశ్వత మరమ్మతు పనుల కోసం అధికారులు చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. రెండేళ్లు గడచినా.. ప్రజాప్రతినిధులు ప్రాజెక్టును క్షేత్ర స్థాయిలో సందర్శించినా నిధులు మాత్రం మంజూరు కాలేదని రైతులు వాపోతున్నారు. ఈ వేసవిలో శాశ్వత మరమ్మతు పనులు పూర్తవుతాయని రైతుల ఆశపడినా.. ఆ దిశగా అడుగులు పడకపోతుండటం రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. వర్షాలు పడితే వరద ఉధృతికి ప్రాజెక్టు పరిస్థితి ఏంటని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అవసరమైన నిధులు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన శాశ్వత మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రాజెక్టు మరమ్మతు పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించామని చిన్ననీటి పారుదలశాఖ డీఈఈ కవిత పేర్కొన్నారు. శాశ్వత పనులకుగాను సర్వే చేపట్టి నివేదించామని.. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే పనులు జరిగేలా శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాగుకు ఇబ్బందులు

ప్రాజెక్టు నిర్మాణం తర్వాత సాగునీటి కొరత చూసిన సందర్భాలు లేవు. గండి పడటంతో పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు వేసవి కాలం ముగియక ముందే గండి పూడ్చివేతపై దృష్టి సారించాలి. చుంచు సమ్మయ్య, రైతు, కల్వల

రైతుల్లో ఆందోళన రెండుసార్లు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా పూర్తి స్థాయిలో పంటలు సాగుకు నోచుకోలేదు. నీరు నిల్వ లేక సాగు, తాగు నీటి కష్టాలు తప్పడం లేదు. ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నా నిధులు రాకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ముద్దం మల్లయ్య, రైతు, కల్వల

## మేల్కొనకపోతే కష్టాలే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని నగరాలు.. పట్టణాల్లో చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది.. ప్రతి రోజు టన్నుల కొద్దీ వెలువడుతున్న వ్యర్థాలతో డంపింగ్ యార్డులు నిండిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఇవన్నీ ప్రమాదకర స్థాయికి చేరితే పరిస్థితి ఏమిటో తెలియని ఆందోళన నెలకొంది. కరీంనగర్‌లో అయితే డంపింగ్ యార్డులో చెత్త పోసేందుకు కూడా స్థలం లేదు.. పైగా ఎండ వేడికి, గాలి దుమారానికి మంటలు అంటుకొని పొగ వ్యాపిస్తుండటంతో సమీప కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారు.. యార్డును ఇక్కడి నుంచి తరలించాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేస్తున్నారు. నగరానికి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ స్థలాల్లో చెత్త నిల్వలు తరలించేందుకు ప్రయత్నిస్తే.. ఆ ప్రాంతవాసులు అడ్డుకుంటున్నారు.. రోజూ వస్తున్న చెత్తను ఎక్కడ నిల్వ చేయాలో తెలియక అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

**వివిధ పట్టణాల్లో ఇలా..**

కరీంనగర్ నగర పరిధిలో డంపింగ్ యార్డులో చెత్త పేరుకుపోయి పరిస్థితి దారుణంగా మారడంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు ప్రారంభించారు. రెండు నెలలుగా 31వ డివిజన్‌లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించేలా కార్మికులతోపాటు ఇంటి యజమానులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ ఆటోల ద్వారా వేరుగా సేకరించి తరలించేలా తనిఖీలు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా అపార్టుమెంట్లు, హోటళ్ల నుంచి తడి, పొడి వేరు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. రామగుండం నగరపాలికలో డంపింగ్‌యార్డు నిండుతుండగా, పొడి చెత్తను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగిస్తున్నారు.

పెద్దపల్లిలో చెత్తంతా తీసుకెళ్లి గుట్టల పక్కన ఉన్న డంపింగ్ యార్డులో పోస్తున్నారు. బయోమైనింగ్ పని చేయకపోగా, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ జరగడం లేదు.

జగిత్యాలలో బయో మైనింగ్ చేస్తున్నా, తడి, పొడి చెత్త వేరు చేయడం లేదు.

కోరుట్ల, సిరిసిల్లలో తడి, పొడి చెత్త వేరు చేయడంతోపాటు బయోమైనింగ్ ద్వారా చెత్తను వేరు చేసి తరలిస్తున్నారు. తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేస్తున్నారు.

జమ్మికుంట, హుజూరాబాద్‌లో తడి, పొడి వేరు చేస్తుండగా పొడి చెత్త డంపింగ్ యార్డుకు, తడితో ఎరువు తయారీకి వినియోగిస్తున్నారు.

వేములవాడలో డంపింగ్ యార్డు గుట్టల మధ్యన ఉండగా చెత్త అంతా అక్కడికే తరలిస్తున్నారు.

మెట్‌పల్లిలో రెండు డంపింగ్ యార్డులు ఉండగా పొడి వస్తువులను వేరు చేసి మిగతాది యార్డులో నిల్వ చేస్తున్నారు.

**ఇలా సేకరిస్తేనే..**

ఇంటి యజమానులు తడి, పొడి చెత్త వేరుగా ఇవ్వడం, చెత్త ఆటోల ద్వారా అలాగే తరలించడం ద్వారా వ్యర్థాలు ఎక్కువ పేరుకుపోకుండా చూసుకోవచ్చు.

తడి చెత్తను కంపోస్టుగా తయారు చేయడం ద్వారా సద్వినియోగం చేసుకోవచ్చు.

పొడి చెత్తలో ప్లాస్టిక్ వస్తువులు, అట్టలు, కాగితాలు, ఇనుప ముక్కలు, ఇతరత్రా వస్తువులన్నీ వేరు చేసి విక్రయించుకునేలా ప్రోత్సహించాలి.

## చేపల కొలను.. ఉపాధికి దన్ను



చొప్పదండి: గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి కూలీలకు చేతినిండా పని కల్పించడంతోపాటు మత్స్యకారులకు ఏడాది పొడవునా చేపలను పెంచుతూ ఉపాధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకంలో చేపల కొలనుల తవ్వకాలు చేపడుతోంది. దీంతో చెరువులు, కుంటల శిఖం భూమి పరిరక్షణకు దోహదపడటంతోపాటు కూలీలకు, మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. జిల్లాలో అనువైన చెరువులు, కుంటల సమీపంలో శిఖం భూములు, నీటిని తరలించేందుకు వీలున్న ప్రాంతాలను అధికారులు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో జిల్లాలో ఈ ఏడాది మొదటి విడతలో భాగంగా 260 చెరువుల్లో పనుల ప్రారంభానికి అనుమతులు వచ్చాయి. దీంతో వాటిని వెంటనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేస్తున్నారు.

**రూ.291.45 చొప్పున కూలీ**

జిల్లాలోని 16 మండలాల పరిధిలో 83,215 జాబ్‌కార్డులు ఉండగా 1,27,644 మంది కూలీలున్నారు. చేపల కొలనుల నిర్మాణానికి 12 లక్షల పని దినాలను కేటాయించారు. చెరువులకు 100 నుంచి 300 మీటర్ల దూరంలో 25 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల లోతుతో తవ్వుతున్నారు. ఒక్కో కొలను నిర్మాణానికి రూ.6.5 లక్షల నుంచి 8 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇందులో పనిచేసిన కూలీలకు ప్రతీ క్యూబిక్ మీటరుకు రూ.291.45 చొప్పున కూలీ ఇవ్వనున్నారు. ప్రధాన చెరువులోని నీరు చేపల చెరువులోకి రాకుండా నాలుగు వైపులా కట్టలు నిర్మిస్తున్నారు.

భూగర్భ జలాల వృద్ధి

రానున్న వర్షాకాలంలో వాన నీటిని నిల్వ చేసుకోవడానికి చేపల కొలనులు దోహదపడతాయి. నీరు నిలువ ఉండడంతో భూగర్భ జలాల వృద్ధి పెరుగుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో ఈ నీరు సాగుకు ఎంతో ఉపయోగపడతాయి. కొలనులోని మట్టిని పొలాల్లో వేసుకోవడంతో భూసారం పెరుగుతుంది. చేపల పెంపకంతో మత్స్యకారులకు అదనపు ఆదాయంతోపాటు మార్కెట్‌లో డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా పెరుగుతుంది. చెరువుల శిఖం భూములు అన్యాక్రాంతం కాకుండా ఉంటాయి. సద్వినియోగం చేసుకోవాలిజిల్లాలో ఉపాధి పనుల్లో భాగంగా చేపల కొలనులను విస్తృతంగా చేపడుతున్నాం. పనులు పురోగతిలో ఉన్నాయి. ఇవి పూర్తయితే మత్స్యకారులకు ఎంతో ఉపయుక్తంగా ఉండనున్నాయి. సద్వినియోగం చేసుకోవాలి.

వేణుమాధవ్‌రెడ్డి, ఇన్‌ఛార్జ్ డీఆర్డీవో

## ఇసుకాసురులు ఇష్టారాజ్యం

జమ్మికుంట: మానేరు పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోతుంది. జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలోనే నెలకు 20 నుంచి 30 ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొంటున్నా.. యజమానులు, డ్రైవర్లలో మార్పు రావడంలేదు. అక్రమార్కులపై కేసులు పెట్టినా దందా ఆపడంలేదు. జిల్లా ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తే తప్ప ఈ రవాణాను కట్టడి చేయలేరని పలువురు చర్చించుకుంటున్నారు.

**నిత్యం వందల ట్రాక్టర్లలో..**

మానేరు పరీవాహక ప్రాంతంలో ఇసుక సులువుగా లభించడంతో అక్రమార్కులు వ్యాపారంగా మలుచుకున్నారు. జమ్మికుంట మండలం విలాసాగర్‌లో ఇసుక రవాణాను జీవనోపాధిగా మలుచుకున్నారంటే విస్మయాన్ని కల్గిస్తుంది. ఉదయం 3 గంటల నుంచే ట్రాక్టర్లలో నింపిన ఇసుకను జమ్మికుంట మీదుగా తరలిస్తున్నారు. సెల్‌ఫోన్ల ద్వారా సమాచారాన్ని చేరవేసుకుంటూ అధికారుల కదలికలపై డ్రైవర్లు అప్రమత్తమవుతున్నారు. ఉదయం పరిమితికి మించిన వేగంతో ఇచ్చే ట్రాక్టర్లతో వాకర్స్ ఆందోళన పడుతున్నారు.

**దూరాన్ని బట్టి ధర**హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మండలం విలాసాగర్, తనుగుల, గండ్రపల్లి, శంభునిపల్లి, వావిలాల, నాగారం, వీణవంక మండలం చల్లూరు, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, పోతిరెడ్డిపల్లి, కొండపాక, హుజూరాబాద్ మండలం కందుగుల, చెల్పూర్‌తోపాటు తదితర ప్రాంతాల నుంచి నిత్యం 300 నుంచి 700 ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిపోతుంది. ట్రాక్టర్ ఇసుకకు రూ.2,500 నుంచి రూ.5 వేల దాకా తీసుకుంటున్నారని



నిర్మాణ యజమానులు చెబుతున్నారు.

**ప్రభుత్వ నిర్మాణాల సాకు చూపి**

ప్రభుత్వ భవన నిర్మాణాలకు ఇసుకను తరలిస్తున్నట్లుగా ట్రాక్టర్‌కు పలువురు ఫ్లెక్సీలు కట్టుకొని దందా సాగిస్తున్నారు. విలాసాగర్ మానేరు ప్రాంతంలో సోమవారం జమ్మికుంట తహసీల్దార్ రమేశ్‌బాబు దాడులు నిర్వహించి 5 ట్రాక్టర్లను పట్టుకొన్నారు. వీణవంక మండలం మల్లారెడ్డిపల్లిలోనూ ఇదే పరిస్థితి. వావిలాల మానేరు ప్రాంతాన్ని ఇటీవల ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పరిశీలించారు. అక్రమ రవాణా కాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిఘా కఠినతరం చేస్తే దందాకు తెరపడనుందని భావిస్తున్నారు.

**నిఘా పెడుతున్నాం**

విలాసాగర్ మానేరు ప్రాంతం నుంచి అధికంగా రవాణా జరుగుతుంది. పోలీసులు, అధికారులు ప్రభుత్వం అనుమతి లేని ట్రాక్టర్లను పట్టుకొని కేసు పెట్టినా పరిస్థితిలో మార్పు రావడంలేదు. ఇటీవల విలాసాగర్ మానేరు ప్రాంతంలో సిబ్బందితో దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నా.. మరలా రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి తీసుకువచ్చింది. క్షేత్రస్థాయి నుంచి నిఘాను కట్టుదిట్టం చేసి అరికట్టేలా చూస్తాం. రమేశ్‌బాబు తహసీల్దార్, జమ్మికుంట

## సర్కారు బడి పిలుస్తోంది

పెద్దపల్లి : శిథిలావస్థలో భవనాలు.. పెచ్చులూడుతున్న గోడలు.. అస్తవ్యస్తంగా విద్యుత్తు వ్యవస్థ.. తాగునీటి ఎద్దడి.. ఒంటికి, రెంటికి ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి.. ఇలాంటి సమస్యలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. ఏటా రూ.కోట్లలో నిధులు మంజూరవుతున్నా పనుల్లో ప్రగతి కనిపించడం లేదు. ప్రస్తుత విద్యాసంవత్సరం ముగిసి వేసవి సెలవులు ఆరంభమైన నేపథ్యంలో తిరిగి తెరిచేనాటికైనా మౌలిక వసతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దాదాపు ఒకటిన్నర నెలల పాటు సెలవులుండగా ఈలోగా పనులు చేపడితే విద్యార్థుల వెతలు తీరనున్నాయి.

**ఏళ్ల తరబడి అసంపూర్తిగానే..**

కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణం మూడేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. నిధులు లేకపోవడంతో పనులను వదిలేశారు.

ఓదెల మండలం పొత్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్ల పనులను అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద నామమాత్రంగా చేపట్టడంతో ఇబ్బందులు నెలకొన్నాయి.

పాలకుర్తి మండలం జయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాలలో కిచెన్ షెడ్డు పనులు ఏడాదిగా సా..గుతున్నాయి.

జిల్లాలో 498 పాఠశాలల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు చెబుతుండగా ఎక్కడా అందుబాటులోకి రాలేదు.

విద్యార్థులు లేకపోవడంతో 29 పాఠశాలలు తెరచుకోవడం లేదు.



సమీప ప్రాంతాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు.

**రూ.50 కోట్లకు పైగా బకాయిలు**

జిల్లాలో నాలుగేళ్ల క్రితం 'మన ఊరు, మన బడి'లో ఎంపికైన 191 పాఠశాలల్లో పనులు చేపట్టగా చాలా చోట్ల ఇప్పటికీ పూర్తి కాలేదు. ఉపాధిహామీలో మంజూరైన మరుగుదొడ్లు, ప్రహరీ, కిచెన్ షెడ్ల పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ఉన్నత పాఠశాలల్లో భోజనశాలలు నిర్మించినా డ్యూయెల్ బెంచీలు సరఫరా చేయకపోవడంతో వృథాగా మారాయి. రూ.50 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. 583 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో రూ.25 కోట్లతో పనులు అసంపూర్తిగా మిగిలాయి. రూ.15 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. సెలవుల్లో మేల్కొంటేనే విద్యార్థులకు వెతలు తీరనున్నాయి.

**ప్రాధాన్యతా పనులు చేస్తున్నాం**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మన ఊరు–మన బడి కింద చేపట్టిన పనులకు బిల్లులు నిలిచిపోయాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రాధాన్యతా పనులు చేస్తున్నాం. మాధవి, జిల్లా విద్యాధికారి

# అక్రమార్కులకు సిరి.. సహజ సంపద ఆవిరి

సిరిసిల్ల: సహజ సంపదకు ఆపద వాటిల్లుతోంది. మొరం.. చెరువు మట్టి దందా పలుకుబడి కలిగిన వారికి కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి మాత్రం గండిపడుతోంది. గనులు, రెవెన్యూ అధికారులు తమకు పట్టనట్టుగా మామూలుగా తీసుకోవడం వల్లే జిల్లా అంతటా దందా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇదిగో.. అక్రమాల తంతు**

సిరిసిల్ల పట్టణం చిన్నబోనాలలో జంగమయ్యకుంట, తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లిలోని ప్రభుత్వ భూముల నుంచి సెలవు రోజులు, రాత్రి సమయాల్లో మట్టి దందా యథేచ్ఛగా జరుగుతోంది. ఇక్కడి నుంచి సిరిసిల్ల, తంగళ్లపల్లిల్లోని స్థిరాస్తి వెంచర్లకు తరలిస్తున్నారు. వేములవాడ అర్బన్, గ్రామీణ మండలాల్లో ఎర్రమట్టిదందా యథేచ్ఛగా సాగుతోంది. అనుపురం, కొడుముంజ, రుద్రవరం, మధ్యమానేరు నీరులేని ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా తవ్వుతూ పట్టణాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ. 2 వేలు, టిప్పర్లలో అయితే రూ. 6 వేలు వసూలు చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండా, రాగట్లపల్లి, ముస్తాబాద్ మండలం పొత్గల్ ప్రాంతాల నుంచి మట్టి తవ్వుతూ మండల కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇటీవల ఎల్లారెడ్డిపేట రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందగా తనిఖీలకు వెళ్లారు. దేవునిగుట్టతండా నుంచి అనుమతుల్లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలను ఠాణాకు తరలించారు. అధికారులు పక్కకు వెళ్లిన సమయంలో మట్టితో ఉన్న వాహనాలను తీసుకుపోవడం గమనార్హం. వేములవాడ, కోనరావుపేట, సిరిసిల్ల సమీపంలోని ఇటుక బట్టీలకు నాంపల్లిలోని పెద్దచెరువు నుంచి అయిదువేల క్యూబిక్ మీటర్ల మట్టి



తవ్వకానికి నీటి పారుదలశాఖ అనుమతి పొందారు. కొన్ని అభివృద్ధి పనులకు మర్రిపల్లి చెరువులోని మట్టి తవ్వకాలకు అనుమతినిచ్చారు. గోశాలలో కోడెల వసతి కోసం బురదను తొలగించి మట్టితో చదును చేసేందుకు కొడుముంజ నుంచి మట్టిని తరలించారు. ఇవన్నీ తాత్కాలిక అనుమతులు పొందినవి మాత్రమే కానీ.. వీటిని అడ్డం పెట్టుకొని అడ్డగోలు తవ్వకాలు జరిపారు. తంగళ్లపల్లి మండలంలో రైల్వేలైను నిర్మాణ పనులకు లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి అవసరముందని రెవెన్యూశాఖకు దరఖాస్తు చేసుకున్నారు. చంద్రవంక ప్రాజెక్టులోని మట్టి ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ముస్తాబాద్ మండలం పొత్గల్‌లోని ఇటుక బట్టీల నిర్వాహకులు తహసీల్దార్‌కు మట్టి అవసరమై దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు పరిశీలించి అనుమతులు ఇవ్వకుండానే అక్రమంగా మట్టిని తవ్వుతుండటం గమనార్హం. జిల్లాలో మట్టి తవ్వకాలకు ప్రత్యేకంగా పాలసీని తీసుకొస్తేనే అక్రమాలకు అడ్డుకట్టవేసే అవకాశం ఉంటుంది.

**ఫిర్యాదులు వస్తే చర్యలు**

– క్రాంతికుమార్, గనులశాఖ ఏడీ


రెవెన్యూ, నీటిపారుదలశాఖలు అనుమతులు మంజూరు చేస్తున్నాయి. ఎన్ని క్యూబిక్ మీటర్లకు అనుమతులు ఉంటే వాటికి మాత్రమే వేబిల్లులు జారీ చేస్తున్నాం. అక్రమంగా తరలించిన వాటిపై ఫిర్యాదులు వస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

# ఏళ్లు గడిచినా అద్దె భవనాల్లోనే!

సారంగాపూర్: మండల కేంద్రాలు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా మౌలిక వసతుల్లేక అరకొర వసతుల మధ్య పరిపాలన కొనసాగించాల్సి వస్తోంది. సరైన వసతులతో అద్దె భవనాలు దొరకపోవడంతో శిథిలావస్థ భవనాల్లోనే కార్యాలయాలు ఏర్పాటు చేశారు. జిల్లాల ఆవిర్భావ సమయంలో జగిత్యాల జిల్లాలో సారంగాపూర్ నుంచి బీర్‌పూర్, ధర్మపురి నుంచి బుగ్గారం, జగిత్యాల నుంచి జగిత్యాల గ్రామీణం, ఇటీవల మేడిపల్లి నుంచి భీమారం, వెల్గటూర్ నుంచి ఎండపల్లి గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేశారు. బీర్‌పూర్‌లో పాత పాఠశాల భవనాల్లో, బుగ్గారం, జగిత్యాలలో పాత ప్రభుత్వ భవనాల్లోనే కార్యాలయాలను కొనసాగిస్తున్నారు.

**పూర్తయిందొక్కటే..!**

బీర్‌పూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు స్థల సేకరణ కొలిక్కి రాకపోవడంతో కేవలం మండల విద్యాధికారి కార్యాలయం భవనం ఒక్కటే పూర్తి చేయగలిగారు. తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి గతంలో ప్రత్యేక నిధులు విడుదల చేసినప్పటికీ ఎస్సారెస్పీ ముంపు గ్రామాల పునరావాస గ్రామాల ప్రజల కోసం పక్కా పాఠశాల భవనం నిర్మించి నిరుపయోగంగా ఉండడంతో మరమ్మతు చేపట్టి అందులోనే కార్యాలయం



కొనసాగిస్తున్నారు. మండల పరిషత్తు కార్యాలయం అద్దె భవనంలో కొనసాగగా గతేడాది పెచ్చులూడడంతో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనంలోకి మార్చారు. కార్యాలయాన్ని మార్చారు కానీ నిధుల విడుదల లేకపోవడంతో కనీస వసతులు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పోలీసు స్టేషన్ ఇప్పటికీ అద్దె భవనంలోనే కొనసాగుతుండగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు కావడంతో పనులు కొనసాగుతున్నాయి. వ్యవసాయ కార్యాలయాన్ని రైతు వేదికలో కొనసాగిస్తుండగా, మిగతా కార్యాలయాలు ఎక్కడొన్నాయో ప్రజలకు తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల రెవెన్యూ మంత్రి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా పక్కా భవనాలకు నిధులు మంజూరు చేస్తానని హామీచ్చారు. నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేస్తేనే అద్దె భవనాల కష్టాలు తీరనున్నాయి.

**నిధులు మంజూరు చేయాలి**

ప్రస్తుతం పాత పాఠశాల భవనంలో మండల పరిషత్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నాం. మరమ్మతు చేపట్టినప్పటికీ పూర్తి స్థాయిలో వసతులు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నూతన కార్యాలయాలు పూర్తి చేస్తేనే ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందనున్నాయి. – లచ్చాలు. ఎంపీడీవో బీర్‌పూర్

# జనావాసాల్లోకి వన్యప్రాణులు



పూడూరు: అడవులను సంరక్షించడం.. పెంచడం, కలప రవాణా అరికట్టడం.. వన్యప్రాణులను కాపాడేందుకు ప్రభుత్వం తగిన నిధులు ఖర్చు చేస్తున్నా అమలు సరిగా లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా అడవి జంతువులు, పక్షులకు సరైన స్థావరాలు లేక జనారణ్యంలోకి పరుగులు పెడుతున్నాయి. పంట పొలాల్లోకి దూరి పొలాలను నాశనం చేస్తున్నాయి. మేకలు, గొర్రెలు, దూడలపై దాడులు చేస్తుండడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలా వచ్చిన వన్యప్రాణులు శునకాల బారిన పడి మృత్యువాత చెందిన ఘటనలు ఉంటున్నాయి. ఈ ప్రాంతంలోని దామగుండం, తిప్పాపూర్, కండ్లపల్లి, నస్కల్, మహమ్మదాన్‌పల్లి, అనంతగిరితో కలుపుకుని దాదాపు 5,945 ఎకరాల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇరువైపుల పొలాలు ఉన్నాయి.

**సంరక్షణ లోపాలకు నిదర్శనాలివి...**

కుల్కచర్లలో ఇటీవల ఓ జింక జనారణ్యంలోకి వచ్చి ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన గేటులో ఇరుక్కుంది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి బయటకు తీసి ప్రథమ చికిత్స అనంతరం కార్యాలయానికి తరలించి పర్యవేక్షణలో ఉంచారు. అనంతరం తీవ్ర అనారోగ్యానికి గురై మృత్యువాత పడింది. ః దోమ మండలం కొత్తపల్లికి చెందిన రైతు గుంట మల్లేశం పొలం వద్ద ప్రత్యేకంగా షెడ్డువేసి గొర్రెలు పెంచుతుండగా అడవి జంతువు దాడి చేసి ఒకే రోజు 44 గొర్రెపిల్లలను చంపేసింది. తొలుత ఊర కుక్కలుగా అనుమానించినా.. ఆ తర్వాత అది అడవి జంతువు పనేనని నిర్ధారించారు.

ఏడాదిన్నర కిందట ధారూరు మండలంలోని ఓ గ్రామంలో పాకలోని మేక పిల్లలపై అడవి జంతువులు దాడిచేసి హతమార్చాయి. ః కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ సమీపంలో ఏడాది కిందట అటవీ ప్రాంతానికి సమీపంలో ఓ రైతు వేసిన పశువుల పాకలో కట్టి ఉంచిన ఆవు మృత్యువాత పడింది హైనా దాడి చేసినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు.

గతంలో పట్టపగలు కండ్లపల్లి అడవి నుంచి ఓ కొండగొర్రె అంగడిచిట్టంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి వచ్చింది. శునకాలు వెంబడించటంతో ఉపాధ్యాయులు కాపాడి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. రెండు రోజుల తరువాత మృత్యువాత పడింది.

**ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం: అరుణ, ఫారెస్టు అధికారిణి**

తమ పరిధిలోని జంతువుల సంరక్షణపై ప్రత్యేకం శ్రద్ధ వహిస్తున్నాం. దామగుండం, తిప్పాపూర్ తదితర అడవుల్లో చుట్టూ కందకాలు తీయించటంతో అప్పట్లో ఎటూ వెళ్లకుండా కట్టడి చేయగలిగాం. ప్రస్తుతం అడవి చుట్టూ ఉన్న కొన్ని కాలువలు మూసుకు పోవటంతో జంతువులు జనావాసాల్లోకి వస్తున్నాయి. శునకాల బెడద తీవ్రం కావటంతో తప్పించుకునే క్రమంలో అడవులను వదులుతున్నాయి. నివారణ చర్యలు చేపడతాం.

# అంగన్వాడీకి గూడు.. తీరనున్న గోడు



వికారాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల బలోపేతం దిశగా అడుగులు వేస్తోంది. జిల్లాకు 38 కొత్త భవనాలను మంజూరు చేశారు. త్వరలో వీటి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. గత ఆగస్టులో అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధించే పాఠ్యాంశాలను మార్చారు. దానికనుగుణంగానే బోధిస్తున్నారు. ఆడుతూ.. పాడుతూ చిన్నారులకు బోధించే విధానాన్ని తీసుకొచ్చారు.

**జిల్లాలో 1,129 కేంద్రాలు..**జిల్లాలో గతంలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. కొత్తగా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలోని పంచాయతీలు వికారాబాద్‌లో విలీనమయ్యాయి. దీంతో ఆయా పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను వికారాబాద్ జిల్లాలో కలిపారు. దీంతో కొత్తగా 22 అంగన్‌వాడీ కేంద్రాలు చేరాయి. ప్రస్తుతం 1,129 ఉన్నాయి. వీటిలో 500 కేంద్రాలకు పక్కా భవనాలున్నాయి. 439 ఉచిత భవనాల్లో కొనసాగుతున్నాయి. 195 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిలో 38 కేంద్రాలకు కొత్త భవనాలు మంజూరు చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ. 12 లక్షలు వ్యయం చేయనున్నారు. ఇందులో 8 లక్షలు ఈజీసీ, రూ. 2 లక్షలు 15 ఆర్థిక సంఘం, రూ. 2 లక్షలు మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా సమకూరుస్తారు.

**సదుపాయాల కల్పన..**

పక్కా భవనాలున్న, ప్రభుత్వ పాఠశాలల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించారు. జిల్లాలో పరిగి, కొడంగల్, మర్పల్లి, వికారాబాద్, తాండూరు ప్రాజెక్టులున్నాయి. కేంద్రాల్లో పంకాలు బిగించారు. లేనిచోట్ల శౌచాలయాలు నిర్మించారు. తాగునీటి సౌకర్యం లేని కేంద్రాలను గుర్తించి ఏర్పాటు చేశారు. అధ్వానంగా మారిన 668 కేంద్రాలను గుర్తించి రంగులు వేశారు.

**వేగంగా పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం..**

అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. పనులు నామినేషన్‌పై కేటాయిస్తారు. వేగంగా పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. భవనాల పూర్తయితే చిన్నారులకు అనుకూలంగా ఉంటుంది. డా. పి. జయసుధ, జిల్లా సంక్షేమాధికారిణి, వికారాబాద్.

7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు: 34,497

3- 6 ఏళ్ల పిల్లలు: 19,693

# అన్నదాతకు గుండె కోత



వికారాబాద్ : నాణ్యతలేమితో నిర్మించిన చెక్‌డ్యాంల కారణంగా భారీ వర్షాలకు కోతకు గురయ్యాయి. మూడేళ్ల క్రితం కాల్వశ్రీరాంపూర్ పరిధిలోని పలు వ్యవసాయ భూములు వరద ధాటికి చెక్‌డ్యాంలు కట్టిన ప్రదేశాల్లో కరకట్టలు కొట్టుకుపోయి దెబ్బతిన్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమకు కొంతైనా ఆసరా కల్పిస్తే మేలు జరుగుతుందని రైతులు దీనంగా ఎదురుచూస్తున్నా.. భారాస ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత సర్కారు అయినా తమ భూములను పరిశీలించి నష్ట పరిహారంతో ఆదుకోవాలని కోరుతున్నారు.

**అందని పరిహారం**

కాల్వశ్రీరాంపూర్ పరిధి మీర్జంపేటలోని పోచంపల్లిలో మానేరు నదిపై రూ. 11 కోట్లతో 2022లో నిర్మించిన చెక్‌డ్యాం.. వరద ధాటికి ఏడాది గడవకముందే తెగిపోయింది. గుత్తేదారు చెక్‌డ్యాం నాణ్యతగా నిర్మించకపోవడంతోనే సుమారు 50 ఎకరాల్లో ఇసుక మేటలు వేసి, కోతకు గురి కావడంతో సాగుకు పనికిరాకుండా పోయాయి. నేటికి మూడేళు గడిచింది. దెబ్బతిన్న పంటలను అప్పటి అధికారులు పరిశీలించినా.. ఇప్పటికి రైతులకు పరిహారం అందలేదు.

**ఐదు మంజూరు.. రెండు పూర్తి**

హుస్సేన్‌మియా వాగుపై సుమారు రూ. 17 కోట్లతో కాల్వశ్రీరాంపూర్‌లో రెండు, మడిపల్లి, పెగడపల్లి, పెద్దరాతుపల్లిలలో ఒక్కోటి చొప్పున మొత్తం ఐదు చెక్‌డ్యాంలు మంజూరయ్యాయి. పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్‌లో 2022లో పూర్తికాగా అధిక వర్షాలకు ఏడాది గడవకముందే కొట్టుకుపోయాయి. పంట భూములు కోతకు గురై, ఇసుక మేటలు వేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి.. తెగిపోయిన చెక్‌డ్యాంలు నాణ్యతగా నిర్మించి, తమకు నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

**గుత్తేదారులదే బాధ్యత**కాల్వశ్రీరాంపూర్ మండలం పరిధిలోని మానేరు, హుస్సేన్‌మియా వాగుల పరిధిలో తెగిపోయిన చెక్‌డ్యాంలను తిరిగి నిర్మించే బాధ్యత గుత్తేదారులదే. కూలినవాటిలో స్థానంలో కొత్తగా పనులు చేపట్టేలా, నష్టపోయిన రైతుల భూములు చదును చేసేలా గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పనులు చేపడతాం. – శ్రావణ్, నీటిపారుదల శాఖ ఏఈ

# హామీలతోనే సరి!

జగిత్యాల : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యాంత్రీకరణ రాయితీని పునరుద్ధరిస్తామన్న హామీ 2024-వానాకాలం, 2024-25-యాసంగి సీజన్లలోనూ నెరవేరలేదు. గత యాసంగిలో మహిళా రైతులకు యంత్ర పరికరాలు ఇస్తున్నట్లు పేర్కొన్నా సాధారణ నిధుల్లో ఇవి 5 శాతంకూడా ఉండవు. ప్రస్తుతం 2025-వానాకాలం సీజన్ మొదలైన నేపథ్యంలో యాంత్రీకరణకు నిధులను గతంలో మాదిరిగా పూర్తిస్థాయిలో విడుదల చేస్తేనే దున్నేవారికి దన్నుగా ఉంటుంది. సాగులో కూలీలకొరతతో రైతులు యంత్రాలపైనే పూర్తిగా ఆధారపడుతున్నారు. ఆరేళ్లక్రితం వరకు ప్రభుత్వంద్వారా అనేక రకాలైన యంత్రాలు, పరికరాలు, పనిముట్లను రాయితీపై ఇవ్వగా తదుపరి నిలిపివేతతో రైతులు పూర్తిధరకు యంత్రాలను బయటి మార్కెట్లో కొంటున్నారు. యంత్రాలను కొనలేనివారు హార్వెస్టర్లు, ట్రాక్టర్లు తదితరాల సేవలకు అధికంగా అద్దెలను చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నారు. రాష్ట్రబడ్జెట్లో యంత్రలక్ష్మి పథకానికి 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,500 కోట్లు, 2024-25లో రూ. 1,650 కోట్లను, 2025-25లో రూ. 1,800 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నా జిల్లాలకు నిధుల విడుదల మాత్రం జరగటంలేదు. ప్రస్తుతం వానాకాలం సాగు మొదలుకాగా నిధులు



విడుదలచేసి ఆర్‌కేవీవై, యంత్రలక్ష్మి, ఉద్యాన మిషన్ తదితర పథకాల ద్వారా ఆగ్రోస్ మధ్యవర్తిత్వంతో ప్రభుత్వం యంత్రాలు, పరికరాలను సరఫరాచేస్తే రైతులకు నాణ్యమైన యంత్రాలు అందుతాయి. ఉమ్మడి జిల్లాలో ఒక సీజన్‌లో 12.43 లక్షల ఎకరాల్లో ఆహార, వాణిజ్య పంటలు, 1.91 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగు చేస్తున్నందున యంత్రాల వినియోగం అవశ్యంగా మారింది. దుక్కులకు, పొలాలను దున్నేందుకు ట్రాక్టర్ల వినియోగం 98 శాతానికి చేరగా వరికోతలకు పూర్తిగా హార్వెస్టర్లను వాడుతున్నారు. మినీట్రాక్టర్లు, పవర్‌టిల్లర్ల వినియోగం కూడా పెరగగా బోదెలు చేయటం, పసుపు ఉడికించి పాలిషింగ్, పత్తిలో దౌరకొట్టడం, మొక్కజొన్నలను ఒలవటం, ఇతరపైర్ల నూర్పిడి, మామిడిలో సస్యరక్షణ మందుల పిచికారీ, నేలలను చదును చేయటం, గడ్డికోత, గట్టుచేయటం తదితరాలన్నీ యంత్రాలు, పరికరాల సాయంతోనే చేపడుతున్నారు. గడ్డి కట్టలుకట్టే బేలార్ కటింగ్ యంత్రాలు, ఫ్లవ్‌లు, కల్టివేటర్లు, రొటోవేటర్లు, టార్పాలిన్‌షీట్లు, పంపుసెట్లు, పిచికారీ యంత్రాలు, సీడ్‌డ్రిల్, నీటిపైపులు, బిందు, తుంపరసేద్య పరికరాలు, సోలార్ ఫెన్సింగ్, డ్రోన్లు, పత్తితీత యంత్రాలు, మామిడి కాయలను తెంపే పరికరాలు, కొడవళ్లు, ఎద్దులతో నడిపే పరికరాల రాయితీని గతంలో మాదిరిగా మంజూరిస్తే రైతులకెంతో సాయంగా ఉంటుంది. యాంత్రీకరణకు నివేదించామని, నిధుల విడుదల, యంత్రాల మంజూరుకు అనుమతిస్తే రైతులనుంచి దరఖాస్తులను తీసుకుంటామని జగిత్యాల డీఏవో వడ్డెపల్లి భాస్కర్ పేర్కొన్నారు.

# దోమలొస్తున్నాయ్.. తెర వేసేయాలి..!

మిర్యాలగూడ : వానాకాలం వీధుల్లో, ఖాళీ స్థలాల్లో ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి దోమల వ్యాప్తి అధికమవుతుంది. ఈ కారణంగా ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతుంటారు. విష జ్వరాల బారిన పడి చికిత్స పేరుతో డబ్బులు నష్టపోవడంతో పాటు..పలువురు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. వానాకాలం ప్రారంభానికి ముందే దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**ఇవి పాటించండి...**

చర్మానికి దోమలను వికర్షించే క్రీములను రాసుకోవాలి.

ఇంటి కిటికీలకు జాలీలు, తలుపులకు తెరలు కట్టుకోవాలి.


పాత కూలర్లు, టైర్లు, కొబ్బరి చిప్పలు వంటి వాటిని వెంటనే పడేయాలి.

నీటి సంపులు, డ్రమ్ములు, నీటి తోట్లపై మూతలు ఏర్పాటు చేయాలి.

వారానికి ఒక సారి డ్రై డేగా పాటించి..నీరు నిల్వ చేసే అన్నింటిని ఖాళీ చేయాలి.

**స్థానిక సంస్థలు ఇవి చేయాలి...**

దోమల నివారణకు స్థానిక సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నందికొండ, హాలియా, నకిరేకల్, చిట్యాల, చండూరు పురపాలికలతో పాటు 33 మండలాలు, 564 గ్రామ



పంచాయతీలు ఉన్నాయి. సుమారు 17 లక్షల జనాభా ఉంది. ప్రస్తుతం అన్ని స్థానిక సంస్థల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతుండటంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం వానాకాలం ప్రారంభమైనందున దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వారానికి ఓ సారి మురుగు కాల్వలు శుభ్రం చేసి..దోమల నివారణకు ప్రత్యేక చర్యలు.

దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారి, ఫాగింగ్.

రోడ్లు, ఖాళీ స్థలాల్లో నీరు నిలవకుండా చర్యలు.

ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పొడి చల్లించాలి.

పక్క కాల్వలు, నాలాల్లో లార్వా నివారణ చర్యలు.

మురుగు కాల్వల్లో నూనె బంతులు వేయాలి.

**నివారణకు చర్యలు**

దోమల నివారణకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా సాధారణ రోజుల్లో దోమల నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తూ పలు రకాల కార్యక్రమాలు చేపడుతున్నాం. దోమలు అధికంగా వ్యాప్తి చెందే జూన్, జులై నెలల్లో వారంలో రెండు రోజులు మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. మలేరియా, డెంగీ అధికంగా వచ్చే ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి బాధితులకు చికిత్స, ప్రజలకు అవగాహన కల్పించనున్నాం. డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, జిల్లా మలేరియా అధికారి, నల్గొండ

# క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల సందడి

మేడ్చల్ : 2025-2026 విద్యా సంవత్సరానికి తెలంగాణ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ఈనెల 16 నుంచి మొదలవుతోంది. ఎంపికలు హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్ ప్రాంతాల్లోని క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాలకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా పోటీలకు పంపిస్తారు. జిల్లాస్థాయిలో సత్తా చాటిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఇందుకోసం 33 జిల్లాలను 5 గ్రూపులుగా విభజించారు. హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్ పాఠశాలకు రాష్ట్రస్థాయి పోటీలు హకీంపేటలోనే నిర్వహిస్తారు. ప్రతి పాఠశాలలో 4వ తరగతికి 20 మంది బాలికలను, 20 మంది బాలురను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో మూడు క్రీడా పాఠశాలలకు 120 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు.

**ఈ ఆటల్లో శిక్షణ**

ఎంపికైన చిన్నారులకు హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో విలువిద్య, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రోయింగ్, వెయిట్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్, జూడో, బాక్సింగ్, రెజ్లింగ్, స్విమ్మింగ్, యోగాలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. క్రీడలతోపాటు 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పైసా ఖర్చు లేకుండా విద్యార్థుల పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటుంది. నిత్యం ఉ: 6-8.30 వరకు, సా: 4-6.30 వరకు శిక్షణ ఉంటుంది.

**పోటీలు ఈ అంశాల్లో..**

3 తరగతి చదివిన విద్యార్థులు అర్హులు.




01.09.2016 - 31.08.2017 మధ్య పుట్టి ఉండాలి.
ఎత్తు.. 127-147 సెం.మీ ఉండాలి.
బరువు.. 24-33 కేజీల మధ్య ఉండాలి.
30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ప్ పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 6/10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్‌బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్టు నిర్వహిస్తారు.
ఒక్కో క్రీడకు 3 మార్కుల చొప్పున మొత్తం 27 మార్కులు లెక్కిస్తారు. ఆంత్రో మెట్రిక్- ఫిజికల్ పరీక్షల్లో 15 మార్కులకుపైగా వస్తే అర్హులవుతారు.

**ఈ పత్రాలుండాలి**

పాఠశాల బోనఫైడ్ సర్టిఫికెట్, 3 తరగతి (ప్రోగ్రస్ కార్డు) మార్కుల రికార్డు ధ్రువపత్రం, మండల తహసీల్దార్ లేదా పంచాయతీ లేదా మున్సిపల్ అధికారులు జారీ చేసిన కుల, జనన ధ్రువపత్రాలు, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్, ఒరిజినల్ పత్రాలు.

**ఉద్యోగ అవకాశాలు**

క్రీడా పాఠశాలలో చదివిన విద్యార్థులకు రైల్వే, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, పోలీసు, బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, పీఈటీ/ఫిజికల్ డైరెక్టర్, కోచ్‌లు, కార్పొరేట్ సెక్టార్ ఉద్యోగ అవకాశాలు ఉంటాయి.

**ఎంపిక తేదీలు**

మండల స్థాయి: జూన్ 16 నుంచి 19 వరకు.
జిల్లా స్థాయి: జూన్ 23 నుంచి 26 వరకు.
రాష్ట్ర స్థాయి: జులై 1 నుంచి 5 వరకు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు**

%tgss.telangana.gov.in% వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
క్రీడాధికారుల ఫోన్ నంబర్లు
మేడ్చల్-మల్కాజిగిరి: 9849909081
హైదరాబాద్: 9866317310
రంగారెడ్డి: 9848364143 ప్రతిభతోనే ఎంపిక : టి.మమత, ఓఎస్‌డీ, హకీంపేట క్రీడాపాఠశాల విద్యార్థుల ఎంపిక ప్రతిభ ఆధారంగానే జరుగుతుంది. పైరవీలకు తావులేదు. విలువలతో కూడిన విద్య, క్రీడల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం.

# భవనం.. భయానకం

సూర్యాపేట : పురపాలికల్లో శిథిల భవనాలు ప్రాణసంకటంలా పరిణమిస్తున్నాయి. అవి ఎప్పుడూ కూలుతాయో తెలియదు. వాటిని గుర్తించి కూల్చివేస్తే పెనుముప్పును తప్పించినట్లే. భారీ వర్షాలు కురియక ముందే కార్యాచరణకు దిగాల్సిన ఆవశ్యకత ఉంది. వర్షాలకు గోడలు నాని రాత్రిపూట నిద్రిస్తున్న వారిపై కూలితే మృత్యువాత పడే ప్రమాదం ఉంటుంది. కనీసం వారికి గోడలు కూలాయనే విషయం కూడా తెలియక ముందే తనువు చాలిస్తారు. ఇలాంటి ఘటనలు జరగకముందే పుర అధికారులు కఠినంగా వ్యవహరించాల్సి ఉంది. ఈసారి రెండుమూడు నెలల వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో పాత భవనాలు నాని కూలనున్నాయి, ఇక నుంచి పుర సిబ్బంది వాటిపై నిఘా ఉంచాలి.



పట్టణాల్లో ఎక్కడ కనిపించినా వాటిని నేలమట్టం చేయాలి.
ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో పాత ఇళ్ల యజమానులకు ఇప్పటి వరకు పుర అధికారులు 279 నోటీసులు జారీ చేశారు. వార్డుల్లో పాత భవనాలున్న ఇంటింటికి తిరిగి సిబ్బందితో సహాయ అందజేస్తున్నారు. పుర అధికారులు ఇచ్చిన గడువులోపు వాటిని నేలమటం చేసుకోవాల్సి ఉంటుంది. మరమ్మతుకు గురైన వాటిని వెంటనే చేయించుకోవాలని పుర అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు ఉండగా.. వాటిలో పాత ఇళ్లు చాలా ఉన్నాయి. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరాయి. వాటిలో ఇప్పటికీ కొంతమంది నివాసముంటున్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతూనే ఉంది. వారి సూచనల మేరకు పురపాలికల్లో పాత భవనాలు ఎక్కడ కనిపించినా యజమానులకు నోటీసులు జారీ చేసి కూల్చివేయించాలి.

# పైవంతెనల టెండర్లు రద్దు?



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హెచ్-సిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టుకు ఆదిలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.7వేల కోట్ల విలువైన పనులకు డిసెంబరు 3, 2023న శంకుస్థాపనలు చేయగా.. ఇంత వరకు ఒక్క పని ప్రారంభించలేదు. ఇటీవలే కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఆరు కూడళ్లలో పైవంతెనలు, అండర్‌పాస్‌ల పనులకు, ఖాజాగూడ, ట్రిపుల్‌ఐటీ చౌరస్తా, అంజయ్యనగర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోని రోడ్డు అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తవగా.. తాజాగా చోటు చేసుకున్న పరిణామాలతో ఆయా పనులన్నీ అటకెక్కినట్లుగా తెలుస్తోంది. హైటెక్‌సిటీలోని నాలుగు పనులు దక్కించుకున్న కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై మోర్త్ (మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్) నిషేధం విధించడంతో.. నగరంలోనూ ఆ సంస్థ దక్కించుకున్న టెండర్లను రద్దు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది.

**కేరళ రక్షణ గోడ ఘటనతో..**

కేరళ మలప్పురంలోరి కూరియాడ్‌లో ఎన్‌హెచ్-66పై జరుగుతోన్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల్లో అపశృతి చోటు చేసుకుంది. పైన వెళ్లే జాతీయ రహదారికి సంబంధించిన రక్షణ గోడ కూలడంతో.. కింద వెళ్లే సర్వీసు రోడ్డు కోసుకుపోయింది. నాసిరకం పనులతో ప్రమాదం చోటుచేసుకుని ఉండొచ్చనే ఉద్దేశంతో.. నిర్మాణ సంస్థ కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థను మోర్త్ బ్లాక్ లిస్టు చేసింది. ఈ ఘటన మే 22, 2025న జరిగిందని, విషయం తెలియగానే.. ఆ సంస్థకు నగరంలో కేటాయించిన టెండరును రద్దు చేయాలనే అభిప్రాయంతో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో తెలిపారు.

**ఇటీవలే టెండరు అప్పగింత..**

ప్రభుత్వం హెచ్-సిటీ కింద ఇటీవల రెండు ప్యాకేజీలకు టెండర్లు పిలిచింది. కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లలో పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి రూ.1,090కోట్ల అంచనాతో టెండరును మేగా సంస్థ దక్కించుకుంది. ఖాజాగూడ చౌరస్తా, ట్రిపుల్ ఐటీ చౌరస్తాల్లో పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం, అంజయ్యనగర్ నుంచి రాంకీటవర్స్ వరకు, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి గచ్చిబౌలి ఓఆర్‌ఆర్ వరకు రోడ్డు విస్తరణకు రూ.749కోట్ల అంచనాతో పిలిచిన టెండర్లను కేఎన్‌ఆర్ సంస్థ దక్కించుకుంది.

# నడిరోడ్డే.. డంపింగ్ యార్డు



హైదరాబాద్ : నగరంలోని రహదారి విభాగినిలు చెత్తకుప్పలుగా మారుతున్నాయి. కాలిబాటలు, బస్టాపులు డంపింగ్‌యార్డులు అవుతున్నాయి. పైగా.. పారిశుద్ధ్య సిబ్బంది రోడ్లపై ఊడ్చిన చెత్తను బస్టాపులు, రోడ్డు విభాగినిలపై కుప్పలుగా పోస్తున్నారు. వరదనీటిలో కొట్టుకొచ్చే బురద మట్టిని కాలిబాటల పక్కన కుప్పలు కట్టి వదిలేస్తున్నారు. ప్రధాన రహదారులపై నెలకొన్న ఈ దుస్థితిని జీహెచ్‌ఎంసీ చూస్తూ ఊరుకుంటోంది. పారిశుద్ధ్య విభాగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది.

**కూడళ్ల వద్ద పడేస్తున్నారు..**

కూడళ్ల వద్ద రహదారి విభాగినిలపై చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు, ఆహార పొట్లాలు, ఇతరత్రా చెత్త పేరుకుపోతోంది. కూడలి వద్ద వాహనాలు నిలిచినప్పుడు.. వాహనదారులు వాటిని పడేస్తున్నారు. సిగ్నళ్ల వద్ద యాచకులు, చిరువ్యాపారులు కూడా చెత్తను విభాగినిలపై వదిలేస్తున్నారు. మరికొందరు.. హోటళ్లలో మిగిలిన ఆహారాన్ని పార్సిల్ చేయించి.. వాటిని అక్కడ వదిలేసి పోతున్నారు. మూసాపేట వైజంక్షన్, ఖైరతాబాద్ కూడలి, అసెంబ్లీ ఎదురుగా చౌరస్తాలు చెత్తకుప్పల్లా మారాయి. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. శుభ్రం చేయాల్సిన జీహెచ్‌ఎంసీ మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మెట్రో రైలు విభాగినిలపై పడుతోన్న చెత్తను.. రెండు, మూడు నెలలకోసారి సిబ్బంది తొలగిస్తున్నారు. అప్పటి వరకు కూడలి అపరిశుభ్రంగానే దర్శనమిస్తోంది.

**ప్రధాన బస్టాపుల్లోనూ అంతే..**

జీహెచ్‌ఎంసీ ప్రకటనల విభాగం ఎర్రమంజిల్ బస్టాపులోని షెల్టరును తొలగించింది. పక్కనే ఓ నిర్మాణ సంస్థ.. బస్టాపును గందరగోళంగా మార్చేసింది. కాలిబాట నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేసింది. ఐదు నెలలుగా నిర్మాణ వ్యర్థాలను బస్టాపులోనే కుప్పగా పోసింది. పారిశుద్ధ్య సిబ్బంది కూడా.. రోజూ ఊడ్చి అక్కడే పడేస్తున్నారు. వర్షాలొచ్చినప్పుడు అందులోని మట్టి మ్యాన్‌హోళ్లను పూడ్చేస్తోంది. ఖైరతాబాద్, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్, కేపీహెచ్‌బీ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ తదితర బస్టాపులు చెత్తకుప్పలుగా మారాయి.

కాలిబాటలనూ వదలట్లేదు.. : బంజారాహిల్స్ రోడ్డు నెం.1ను ప్రైవేటు సంస్థలు పదే పదే తవ్వుతున్నాయి. తాజాగా కాలిబాట పక్కన కేబుల్ వైర్ల కోసం తవ్వారు. వ్యర్థాలతో నింపేశారు. సిటీ సెంటర్ చౌరస్తాలో నడవలేని దుస్థితి నెలకొంది. ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం పక్కనున్న కాలిబాటను ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తవ్వడంతో మురుగు గుంతలా తయారైంది. నిమ్స్ నుంచి పంజాగుట్ట వరకు, ఎస్సార్‌నగర్ నుంచి ఎర్రగడ్డ వరకు బురదమట్టిని కాలిబాటల పక్కన పోశారు. అమీర్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, తదితర రద్దీ ప్రాంతాల్లో.. రోడ్లపైనే చెత్తను వేస్తున్నారు.

# అంతొద్దు.. ఇంతే చాలు




హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం తన పంథాను మార్చుకుంటోంది. నాణ్యమైన బోధన అందించేందుకు వీలుగా అఖిల భారత సాంకేతిక విద్యామండలి మార్గదర్శకాలు.. న్యాక్ ప్రమాణాలు పాటించేందుకు నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆచార్యులు లేని విభాగాల్లో సీట్లను తగ్గించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 70 శాతం ప్రొఫెసర్లు లేకపోవడంతో బీబీఏ కోర్సును రద్దు చేసిన యూనివర్సిటీ తాజాగా కెమికల్ ఇంజినీరింగ్, జియో ఇన్ఫర్మేటిక్స్, బీబీఏ(డేటా అనలిటిక్స్) కోర్సుల్లో 30 సీట్లను తగ్గించింది. ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానున్నందున రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ఆయా కోర్సుల్లో సీట్లు తగ్గించిన అంశాన్ని నివేదించారు.

**సీట్లు పెంచుకుందాం... తర్వాత చూసుకుందాం**

క్యాంపస్‌లో చదివేందుకు విద్యార్థులంతా పోటీపడతారన్న అంచనాతో మూడేళ్ల నుంచి వర్సిటీ అధికారులు కొన్ని కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నారు. డిమాండ్ పెరుగుతుండడంతో సీట్ల సంఖ్యను పెంచుతున్నారు. ఫీజులు వస్తుండటం, నిర్వహణ సులువుగా ఉండటంతో ఏటా ఇంజినీరింగ్ ప్రవేశాలప్పుడు సీట్లు పెరిగాయంటూ ప్రకటిస్తున్నారు. అఖిల భారత విద్యామండలి అధికారులు కూడా జేఎన్‌టీయూపై ఉన్న నమ్మకంతో గుర్తింపును కొనసాగిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఏఐసీటీఈ ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్, బీటెక్ జియో ఇన్ఫర్మేటిక్స్ కోర్సుల్లో లోపాలున్నాయని గుర్తించి సరిచేసుకోవాలని ఆదేశించారు. న్యాక్ గ్రేడింగ్ ఇచ్చేందుకు బృందం సభ్యులు ఈ లోపాలతోపాటు మిగిలిన కోర్సుల్లోనూ సరైన సంఖ్యలో ఆచార్యులు లేరని, వెంటనే నియామకాలు చేపట్టాలని సూచించారు. అప్పటికి సరేనన్న జేఎన్‌టీయూ అధికారులు.. వరుసగా ఆచార్యులు పదవీవిరమణ చేస్తుండటంతో లోపాలను పూడ్చలేమని గ్రహించి సీట్లు తగ్గించుకునేందుకు సిద్ధమయ్యారు.

**నియామకాలు నిలిచిపోవడంతో...**

జేఎన్‌టీయూలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు ఆగిపోవడంతో వివిధ కోర్సుల్లో సీట్లు తగ్గించుకునే పరిస్థితి ఉత్పన్నమైంది. చివరిసారి 2013లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లతో బోధన కొనసాగిస్తున్నారు. పదవీ విరమణ చేసినవారిని కొనసాగించవద్దంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో తొలగించారు. వారిలో కొందరిని అతిథి ఆచార్యులుగా నియమించుకున్నారు. ఆచార్యుల కొరత, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ఇంజినీరింగ్ కోర్సుల్లో సీట్లను తగ్గించామని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ కేవీ రావు తెలిపారు.

# స్థలాలు కబ్జా.. సాగు దర్జా

జాజిరెడ్డిగూడెం : జిల్లాలోని ఎస్సారెస్పీ 69,70,71 డీబీఎం ప్రధాన కాల్వలతో పాటు ఉప కాల్వల స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. నాడు భూసేకరణలో పరిహారం పొందినా ఇరువైపులా దున్నేస్తున్నారు. ఫలితంగా వాటి వెంట కనీసం నడిచేందుకు, పరిస్థితి పర్యవేక్షణకు అధికారుల వాహనం వెళ్లడానికి అవకాశం లేకుండా పోయింది. ఇదేమిటని ఇతర రైతులు ప్రశ్నిస్తే మా భూమి ముందు మేం దున్నుకుంటాం.. మా ఇష్టమని చెబుతుండడం గమనార్హం.

**కుచించుకుపోయి.. గండ్లు పడుతూ..**

71 డీబీఎం పరిధిలోని 9ఎల్, 10 ఎల్, 11 ఆర్ పరిధిలో ఆక్రమణలు పరాకాష్టకు చేరాయి. 9ఎల్ పరిధి బొల్లంపల్లి గ్రామ సమీపంలో, 10ఎల్ పరిధిలో కొమ్మాల, కాసర్లపహాడ్ తండా సమీపంలో కాల్వలే మిగిలాయి. 69 డీబీఎం పరిధిలోని తుంగతుర్తి, గానుగుబండ, తూర్పుగూడెం, వెలుగుపల్లి సమీప కాల్వలను ఆక్రమించడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. నూతనకల్ మండలంలో 69 డీబీఎం పరిధిలో 21, 22 ఆర్ ఉపకాల్వలు వెంట ఆక్రమించడంతో నీళ్లు వచ్చినప్పుడు పొంగిపొరలి వృథా అవుతున్నాయి. 70 డీబీఎం పరిధిలో పస్తాల, మామిడిపల్లి తదితర గ్రామాలలో కాల్వల వెంట తిరగడానికి వీల్లేకుండా ఉంది. మరోవైపు గండ్లు పడుతున్నాయి. చివరి ఆయకట్టుకు నీళ్లు రాకున్నా, గండ్లు పడినా కాల్వల వెంట అధికారులు తిరిగి చూడాల్సిన అవసరం ఉంటుంది. ఆక్రమణలతో వారు కాల్వల వద్దకే రాలేకపోతున్నారు. ఇలాగే వదిలేస్తే కాల్వలు మాత్రమే మిగిలే అవకాశం లేకపోలేదు. నాడు ప్రధాన కాల్వల వెంట కాల్వ మధ్య నుంచి 50 నుంచి 70 మీటర్లు, ఉప కాల్వలకు 13 మీటర్ల నుంచి 28 మీటర్ల వరకు భూమిని ప్రభుత్వం సేకరించి రైతులకు పరిహారం అందజేసింది.



కాల్వల నిర్మాణం తర్వాత క్రమంగా కాలువ ఇరుపక్కలా పోసిన మట్టిని తరలించేశారు. అటుపై తేలిన భూమిని సాగు చేస్తున్నారు. దీంతో కనీసం కాల్వ వెంట నడిచి వెళ్లడానికి దారి లేకుండాపోయింది. దీనివల్ల పలు చోట్ల ఉప కాల్వలకు చిన్న చిన్న గండ్లు పడటంతో రైతులు నానా అవస్థలు పడి తాత్కాలికంగా మట్టి పోస్తున్నారు.
ఆక్రమణలతో ప్రధాన కాల్వలకు ఇరువైపులా, చాలాచోట్ల ఉపకాల్వలు 5 మీటర్ల వెడల్పు కూడా లేవు. కొన్నిచోట్ల కేవలం కాల్వలనే మిగిల్చారు. రెండు పక్కలా నడవడానికి కూడా స్థలం లేకుండా దున్నేయడంతో ప్రధాన కాల్వలు చాలాచోట్ల 10 నుంచి 20 మీటర్ల వెడల్పే ఉన్నాయి. ఇరుపక్కలా భూమిని దున్ని సాగు చేస్తున్నారు.
**చర్యలు తీసుకుంటాం**ఎస్సారెస్పీ కాల్వల వెంట భూమి ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటాం. మా దృష్టికి వచ్చిన రైతులతో మాట్లాడి సమస్య లేకుండా చూస్తున్నాం. శాఖలో సిబ్బంది కొరత ఉంది. ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నాంహరిస్వరూప్, నీటిపారుదలశాఖ, ఏఈ

# పంచాయతీలకు బకాయిల పరేషాన్..!

నల్గొండ : జిల్లాలోని చాలా గ్రామ పంచాయతీల్లో ఖజానా ఖాళీ అయ్యింది. చిన్న గ్రామ పంచాయతీలు నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి. వచ్చే వానాకాలంలో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు అవసరమైన కనీస నిధులు అందుబాటులో లేవని ప్రత్యేక అధికారులు వాపోతున్నారు. 2024 ఫిబ్రవరిలో సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారులను నియమించారు. అప్పటి నుంచి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సహా వివిధ పౌరసేవలు కుంటుపడ్డాయి. పంచాయతీలకు సర్పంచులు, పాలకవర్గం ఉంటే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. కానీ ఏడాదికిపైగా ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెల్లో నిర్లిప్తత చోటుచేసుకుంది.

**పేరుకుపోయిన రుణ వాయిదాలు..!**

జిల్లాలో 840 గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ, రవాణాకు, మొక్కలకు నీరు పోసి సంరక్షించేందుకు ట్రాక్టర్లు, ట్రక్కులు, ట్యాంకర్లు గతంలో కొనుగోలు చేశారు. బ్యాంకుల రుణంతో ట్రాక్టర్లు కొనుగోలు చేయగా ప్రతినెలా వాయిదా సొమ్ము బ్యాంకులకు చెల్లించాల్సి ఉంది. రుణ వాయిదాలు చెల్లించలేని పరిస్థితిలో చాలా గ్రామ పంచాయతీలున్నాయి. బంకుల్లో అప్పులు పేరుకుపోవడంతో ట్రాక్టర్లు నడిపేందుకు డీజిల్ అప్పు దొరకని పరిస్థితి కొన్ని పంచాయతీలు ఎదుర్కొంటున్నాయి. కార్యదర్శులు కొందరు తమ సొంత డబ్బు వెచ్చించి నెట్టుకొస్తున్నారు. తాజాగా 400 పంచాయతీల్లో ట్రాక్టర్లకు సంబంధించిన దాదాపు



రూ.3 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. రుణ వాయిదా సొమ్ము పెండింగ్ పడటంతో బ్యాంకుల్లో వడ్డీ పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. కొన్ని పంచాయతీల్లో విద్యుత్తు బిల్లులు, ట్రాక్టర్ల ఈఎంఐలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని దశలవారీగా పరిష్కరిస్తున్నామని, పంచాయతీ కార్యదర్శులు నిబంధనల మేరకు అన్ని సేవలు అందిస్తున్నారని అధికారులు వివరిస్తున్నారు.

**రూ.32.56 కోట్లకు రూ.90 లక్షలే చెల్లింపులు**

వీధి దీపాలు, తాగునీటి పథకాలకు సంబంధించి విద్యుత్తు బిల్లుల చెల్లించలేక గ్రామ పంచాయతీలు బకాయిలు పడ్డాయి. తాజా లెక్కల ప్రకారం జిల్లాలోని 868 గ్రామ పంచాయతీల్లో విద్యుత్తు బిల్లులకు సంబంధించి రూ.32.56 కోట్లు బకాయిలున్నాయి. వీటిలో సుమారు రూ.90 లక్షల వరకు మాత్రమే బిల్లులు చెల్లింపులు జరిగినట్లు విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి.

# ఏటా హరిత లక్ష్యం సంరక్షణలో నిర్లక్ష్యం

సారంగాపూర్ : ఏటా లక్ష్యాన్ని నిర్దేశించుకొని మొక్కలు నాటడంలో చూపుతున్న శ్రద్ధ.. సంరక్షణలో మాత్రం చూపకపోవడంతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది. జిల్లాలోని 380 పంచాయతీల్లో 37.44 లక్షలు(2025-26) నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. కొన్నేళ్లుగా జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా దాదాపు 27,972 ప్రాంతాల్లో సుమారు మూడు కోట్ల మొక్కలు నాటినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఏటా లక్ష్యం నిర్దేశించడంతో స్థలాలు లేకపోవడంతో నాటిన ప్రాంతాల్లోనే మళ్లీ నాటాల్సి వస్తోంది. కొన్ని నర్సరీలలో మొక్కలు అలాగే ఉండిపోయి ఏపుగా పెరిగి వృక్షాలుగా మారుతుండగా వాటిని తొలగించి మళ్లీ మొక్కల పెంపకం చేపట్టాల్సి వస్తోంది. నాటేందుకు లక్ష్యం విధించకుండా నాటిన మొక్కలను సంరక్షించినప్పుడే వన మహోత్సవం విజయవంతం కానుంది.

**ప్రజాధనం వృథా**

నర్సరీలలో మొక్కల కోసం విత్తనాలు విత్తినప్పటి నుంచి పెంపకం వరకు నిర్లక్ష్యం కనిపిస్తోంది. నర్సరీలలో అవసరమైన మొక్కలు పెంచకపోవడంతో పక్కన పడేయాల్సి వస్తోంది. నిబంధనలకు అనుగుణంగా కూలీలు గుంతలు తవ్వినప్పుడే మొక్క ఎదుగుదల ఉంటుంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధి సిబ్బంది గుంతలను ఇష్టానుసారంగా తవ్వుతున్నారు. కమ్యూనిటీ, ప్లాంటేషన్, హరిత వనాలలో గుంతను 0.45 సెం.మీ. లోతు, వెడల్పు ఉండాలి.



రహదారుల వెంట 2 ఫీట్లు(0.6 సెం.మీ) గుంత తప్పకుండా తవ్వాలి. కూలీ ఒక గుంత తవ్వినందుకు రూ.23, మొక్క నాటినందుకు రూ.15 చెల్లిస్తున్నారు. ఇంత మొత్తం వ్యయం చేసినా నిబంధనలకు అనుగుణంగా ఉండడంలేదన్న విమర్శలున్నాయి. ఏటా విద్యుత్తు తీగల కింద మొక్కల నాటడంతో ఎదిగిన మొక్కలను తొలగిస్తున్నారు. మళ్లీ అదే ప్రాంతంలో నాటడంతో ప్రజాధనం వృథా అవుతోంది.

**కోతుల ఆహార ప్రాంగణాలు ఎక్కడ..?**

గతంలో కోతుల కోసం ఆహార ప్రాంగణాలు, పల్లె ప్రజలకు ఆహ్లాద వాతావరణం కోసం పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి వనాలు, రహదారుల వెంట ఉన్న మొక్కలు కనిపిస్తున్నా.. మిగతా హరిత వనాలు, కోతుల ఆహార ప్రాంగణాలు ఎక్కడా కనపడకుండా పోయాయి. పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి ఇంటికి అయిదు మొక్కల చొప్పున లక్ష్యం కోసం అందిస్తున్నారే తప్పా.. వారికి అవసరమైన మొక్కలను అందించకపోవడంతో తీసుకున్న వెంటనే పక్కన పడేస్తున్నారు. ఇంటి ఆవరణలో స్థలం లేనప్పటికీ మొక్కలు అందించడంతో వృథా అవుతున్నాయన్న ఆరోపణలన్నాయి.

# మహిళా సంఘాలకు భరోసా

మెట్‌పల్లి : మహిళా సంఘాల అభ్యున్నతికి గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోంది. సంఘాల్లోని సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తోంది. ఇది వరకే రూ.కోట్ల రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులు వివిధ వ్యాపారాల్లో రాణిస్తున్నారు. వారిలో వ్యాపార నైపుణ్యాన్ని పెంపొందించి ఆర్థికాభివృద్ధి సాధించడానికి మరింత భరోసా కలిగేలా సెర్ప్, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) ద్వారా స్టాండర్డ్ విలేజ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్(స్వెప్) కార్యక్రమం అమలుకు జిల్లాలో మూడు మండలాలను ఎంపిక చేశారు.

రుణాలు పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. కిరాణం, టైలరింగ్, బ్యూటీపార్లర్, దుస్తుల విక్రయ కేంద్రం, పిండి గిర్ని, పాడి పశువుల పెంపకం తదితర జీవనోపాధికి అవసరమైన యూనిట్లను మహిళలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా మహిళా శక్తి కింద క్యాంటీన్లు, ఇతర సూక్ష్మ పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. వ్యాపారాలను విస్తృతపర్చడంలో అనుకున్నంత ముందంజ వేయలేకపోతుండడంతో గ్రామీణ మహిళల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు కనిపించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో వ్యాపార రంగంలో మహిళలకు మరింత నైపుణ్యం, మార్కెటింగ్ మెలకువలపై అవగాహన పెంపొందించి ఆర్థికాభివృద్ధి చెందేలా ఎన్ఆర్ఎల్ఎం ద్వారా స్వెప్ కార్యక్రమం అమలు చేయడానికి నిర్ణయించారు. జిల్లాలో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాలను ఎంపిక చేసి బ్లాక్‌గా ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో



స్వెప్ కార్యక్రమం అమలు చేస్తూ మహిళలకు సేవలందించేందుకు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఎంటర్‌ప్రెన్యూర్(సీఆర్పీ ఈపీ)ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల మెట్‌పల్లిలో వీరి ఎంపికకు అవసరమైన గ్రూప్ యాక్టివిటీ, చర్చ, పరీక్షలను నిర్వహించారు.

**ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు**

మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాల బ్లాక్‌లో 25 మంది సీఆర్పీ ఈపీలను నియమించనున్నట్లు తెలుస్తోంది. ఎన్ఆర్ఎల్ఎం ద్వారా సీఆర్పీ ఈపీలు మహిళల ఆర్థిక ఎదుగుదలకు పని చేయాల్సి ఉంటుంది. మహిళలు ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న, కొత్తగా ఏర్పాటు చేసే సూక్ష్మ పరిశ్రమలను విస్తృతపర్చడం, వ్యాపార నిర్వహణపై అవగాహన పెంపొందించి అవసరమైన రుణాలు ఇప్పించి సాంకేతిక సహకారం అందించాల్సి ఉంటుంది.మొదట మూడు మండలాలను ఎంపిక చేసి కార్యక్రమం అమలు చేసి మహిళా సంఘాల సభ్యుల ఆదాయాభివృద్ధికి తోడ్పాటునందించే దిశగా అడుగులు వేస్తున్నారు.

# మరో 39 మురుగు నీటి శుద్ధి కేంద్రాలు



హైదరాబాద్: నగరంలో మురుగునీటి శుద్ధికి భారీ కార్యాచరణ చేపట్టనున్నారు. ఓఆర్ఆర్ లోపల 972 ఎంఎల్‌డీల సామర్థ్యంలో మరో 39 ఈ శుద్ధి కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. అమృత్ 2.0లో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ ఎస్టీపీల టెండర్ ప్రక్రియ తుదిదశకు చేరింది. త్వరలోనే శంకుస్థాపనకు జలమండలి ఏర్పాట్లు చేస్తోంది. మూసీ ప్రక్షాళనలో భాగంగా వందశాతం మురుగునీటి శుద్ధి లక్ష్యంగా జలమండలి ముందుకెళ్తోంది. హైబ్రీడ్ యాన్యూటీ మోడల్ (హ్యాం) విధానం నిర్మించనున్న ఈ ఎస్టీపీల టెండరు పక్రియపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి సమీక్షించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**నేరుగా చెరువుల్లోకి మురుగు**

ఎస్టీపీల ఏర్పాటుతో పాటు ఓఆర్ఆర్ లోపల అనేక ప్రాంతాల్లో సరైన మురుగునీటి వ్యవస్థ లేదు. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నేరుగా చెరువుల్లోకి మురుగంతా చేరేలా వ్యవస్థలున్నాయి. చెరువులు మురుగుతో నిండిన తరువాత మూసీలోకి చేరుతోంది. మూసీ ప్రక్షాళన నేపథ్యంలో ఈ 39 ఎస్టీపీలు అందుబాటులోకి వస్తే వందశాతం మురుగు నీరు శుద్ధి అవుతుంది.

**ఉస్కబావి వద్ద పెద్దది**

కొత్తగా నిర్మించనున్న వాటిలో ఉస్కబావి ఎస్టీపీ పెద్దది. తిమ్మక్క చెరువు వద్ద 98.5 ఎంఎల్‌డీల సామర్థ్యం, పీర్జాదిగూడ 61, నార్సింగి ఓఆర్ఆర్ 34.5, నాగారం 47.5, కుంట్లూరు 31.5, తెల్లాపూర్ 31 ఎంఎల్‌డీలు, నల్లచెరువు వద్ద మరొకటి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, హైదర్‌షా కోట వద్ద 36.5 ఎంఎల్‌డీ సామర్థ్యం గల మూడు, బాపూఘాట్ సంగం వద్ద 31 ఎంఎల్‌డీల ఎస్టీపీలు నిర్మించనున్నారు. ఇవికాకుండా అమీన్‌పూర్, ఇక్రిశాట్, గండిగూడెం, యమ్నంపేట, ఈదుల చెరువు, ఉమ్దాసాగర్, సందానచెరువు, ఫతేనగర్, చిత్రపురికాలనీ తదితర ప్రాంతాల్లో కొత్త ఎస్టీపీలు రానున్నాయి.

వివరాలు (రూ.కోట్లలో..)

ప్రాజెక్టు వ్యయం 3,849
నిర్మాణ సంస్థ వాటా 1,028
కేంద్ర వాటా 645
రాష్ట్రం వాటా 897
పదేళ్లపాటు నిర్వహణ అంచనా వ్యయం 1,279

# ఉపాధి.. మరింత పారదర్శకం



దౌల్తాబాద్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న పనులపై మరింత పారదర్శకత తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. గ్రామస్థాయిలో నిర్వహించే పనులపై ఊరూరా నిఘా కమిటీలను వేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధిలో మొట్టమొదటిసారిగా గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో గ్రామాల్లో జరిగే పనులపై ఈ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారు. తద్వారా అవినీతికి అడ్డుకట్ట పడి పనులపై స్పష్టత ఉండేందుకు వీలు కలుగుతుంది. ఉపాధి హామీ పథకంలో ఏటా కోట్ల రూపాయలతో పనులు సాగుతున్నాయి. వీటిపై ఏడాదికోమారు సామాజిక తనిఖీ చేసి అవినీతిని గుర్తిస్తున్నారు. కానీ అవినీతి సొమ్మును రికవరీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. కానీ ఈ కమిటీలతో అవినీతిని మొదటనే అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

**వారానికోసారి పరిశీలిస్తారు**

ఉపాధి పనులను కమిటీలు వారానికోసారి పరిశీలించి పనులు జరుగుతున్న తీరు, మంజూరు, కూలీల హాజరు, చెల్లింపులు తదితర వివరాలను గుర్తించి మండల పరిషత్ అధికారులకు వివరాలు అందజేస్తారు. ఇక నుంచి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సామాజిక తనిఖీలు నిర్వహిస్తారు. ప్రతి నెలా మొదటి వారంలో తనిఖీలు నిర్వహించాలని పనుల వివరాలను అందజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే తనిఖీల్లో వెల్లడైన రికవరీ నిధులను తాత్సారం చేయకుండా రాబట్టాలని తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది. ఈ కమిటీలలో మండల ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, మహిళా అధ్యక్షురాలు, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు, ఒక ఉపాధి కూలీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ గ్రామాల్లో జరిగే ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో వారానికోమారు పరిశీలిస్తాయి. ఈ నివేదికను మండల పరిషత్ అధికారికి అందజేస్తారు. వారు జిల్లా అధికారులకు పంపిస్తారు.

**జవాబుదారీతనం పెరుగుతుంది**

ఉపాధిహామీ పథకంలో గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయం లాభదాయకం. దీంతో గ్రామస్థాయిలో నిర్వహించే పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుంది. మొదట్లోనే అవినీతికి అడ్డుకట్ట పడుతుంది. త్వరలోనే అన్ని గ్రామాల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశాం. సరళ, ఏపీడీ, వికారాబాద్.

జిల్లాలో కూలీల వివరాలు

మొత్తం జాబ్ కార్డులు.. 2.41 లక్షలు
పనులు చేస్తున్న కూలీలు.. 1.60 లక్షలు
నిత్యం పనులకు వస్తోంది.. 70,330 మంది

# చెప్పేవారే లేరు.. చదువులెలా..!

బషీరాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ బోధన ఉండాలనే ఉద్దేశంతో గతేడాది జిల్లాలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ కళాశాలను ప్రారంభించారు. విద్యార్థులకు బోధించేందుకు లెక్చరర్లను మాత్రం నియమించలేదు. ఫలితంగా గత విద్యా సంవత్సరం కళాశాలలో చేరిన విద్యార్థులు కొందరు ప్రైవేటు కళాశాలలకు వెళ్లిపోగా.. మిగిలిన విద్యార్థులను సమీప ప్రభుత్వ కళాశాలకు పంపించి బోధన చేయించాల్సి వచ్చింది. ఈఏడాదైనా పూర్తి స్థాయి లెక్చరర్లను నియమించి బోధన సవ్యంగా సాగేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**తాత్కాలిక భవనాలు కేటాయించారు**

జిల్లాకు మారుమూలన ఉన్న బషీరాబాద్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ కళాశాల మంజూరు చేసి తాత్కాలిక భవనాలు కేటాయించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాళ్లను నియమించారు. పదోతరగతి పరీక్ష ఫలితాలు కాగానే ప్రకటనలు చేసి విద్యార్థులను కళాశాలలో చేర్పించుకున్నారు. మొదటి సంవత్సరం కావడంతో ఒక్కో కళాశాలలో 50-60 మంది వరకు ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ వంటి కోర్సుల్లో ప్రవేశం పొందారు. కొత్తగా ప్రారంభించిన నాలుగు ప్రభుత్వ కళాశాలలో మొదటి ఏడాది బోధన సక్రమంగా సాగలేదు.

**50 శాతానికి పైగా బాలికలే..**

మండలానికి దూరంలో ఉండే పట్టణాలకు వెళ్లలేని బాలికలు ప్రభుత్వ కళాశాలలో చేరారు. నాలుగు కళాశాలల్లో 50శాతానికి పైగా మహిళలే ప్రవేశం పొందారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని కళాశాలలో 42 మంది విద్యార్థులు గతేడాది ప్రవేశం పొందితే 30 మంది బాలికలే ఉన్నారు. రెండు నెలల పాటు వేచి చూసిన విద్యార్థులు కొందరు ప్రైవేటుకు వెళ్లిపోయారు. మిగతావారు తాండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదిలో కూర్చొని పాఠాలు విని 80శాతం




విద్యార్థులు పాసయ్యారు. ముగ్గురు బాలికలు 90శాతం మార్కులు సాధించడం గమనార్హం.

**బోధించేవారు లేకపోతే ఏంలాభం**

రవాణా సౌకర్యం ఇబ్బందిగా ఉంటుందని స్థానికంగా ఏర్పడిన ప్రభుత్వ కళాశాలలో మా కూతుర్ని చేర్పించాం. లెక్చరర్లను నియమించలేదని, తాండూరుకు పంపించారు. పాఠాలు చెప్పేవారు లేకపోతే కళాశాల ప్రారంభించి ఏంలాభం.. శ్రీనివాస్, రైతు, బషీరాబాద్.

లెక్చరర్లు వస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది

గతేడాదే కళాశాల ప్రారంభమైంది. ఈఏడాది లెక్చరర్లను నియమిస్తారని ఉన్నతాధికారులు వివరించారు. తద్వారా మరింత సంఖ్య పెరిగే అవకాశం ఉంది. 25కిలోమీటర్ల దూరంలో ఉన్న తాండూరుకు వెళ్లలేని వారు ఇక్కడ చదువుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.నర్సింహారెడ్డి, ప్రిన్సిపల్, ప్రభుత్వ కశాశాల, బషీరాబాద్

# పెద్దాసుపత్రికి నూతన హంగులు

జగిత్యాల : ఎన్నో ఏళ్లుగా ఆధునికీకరణకు నోచుకోకపోయిన జనరల్ ఆసుపత్రి ఎట్టకేలకు నూతన హంగులు సంతరించుకుంది. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని రూ.29 లక్షలతో ఆధునికీకరించారు. మూడు నెలలుగా ఆసుపత్రిలో చేపట్టిన పనులు ముగింపు దశకు చేరాయి. జిల్లా ఆవిర్భావం తరువాత ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కేంద్ర ఆసుపత్రిగా.. ఆ తరువాత ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో అనుబంధంగా సాధారణ ఆసుపత్రిగా హోదాలు మారినా సదుపాయాలు విస్తరించలేకపోయారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఆసుపత్రి వైద్యులతో సమీక్ష నిర్వహించి రూ.1.50 లక్షలు మంజూరు చేశారు. ఆసుపత్రి నిధులు రూ.29 లక్షలు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టారు.

**అత్యాధునిక సేవలు..**

ఆసుపత్రిలో కొన్నేళ్లుగా ఆక్సిజన్ ప్లాంటు నిర్వహణ లేక పనిచేయడం లేదు. సాంకేతిక నిపుణులతో మరమ్మతు చేపట్టడంతో పూర్తిస్థాయిలో రోగులకు ఆక్సిజన్ కొరత తీర్చడమే కాకుండా ప్రతినెలా కొనుగోలు వ్యయం రూ.లక్ష ఆదా అవుతోంది. ఆసుపత్రిలో 9 వెంటిలేటర్లున్నప్పటికీ తరచూ సాంకేతిక సమస్యలుండేవి వాటిని సైతం పూర్తిస్థాయిలో బాగు చేయించారు. రెండు జనరేటర్లలో ఒకటి మరమ్మతుకు గురికాగా ఆధునిక సాంకేతిక వినియోగించి రెండింటిని సరిచేసి రోగులకు నిరంతర విద్యుత్తు అందజేస్తున్నారు. కొత్తగా 7 వీల్‌చైర్లు, 5 స్ట్రెచర్లు కొనుగోలు చేశారు.ఆసుపత్రి భవనంలోపల వెలుపల రంగులు వేశారు. వరండాల్లో స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారగా మరమ్మతు చేశారు. గదులు, వార్డుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ)తో తీర్చిదిద్దారు.



ఆసుపత్రిలో ప్రధాన సమస్య పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోగా ప్రత్యేక మురుగుకాల్వలు నిర్మించారు. మూత్రశాలల పైపులైనుకు మరమ్మతు చేశారు. రోగులకు తాగునీరందించే శుద్ధజల యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చారు.

**90 శాతం పూర్తి: డాక్టర్ సుమన్‌రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్**

మూడు నెలలుగా ఆసుపత్రిలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. 90 శాతం మేరకు పూర్తయ్యాయి. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపడంతో పాటు ఆసుపత్రి నిధులు వెచ్చించి మరమ్మతు పనులు చేపట్టాం. అన్ని విభాగాల్లోనూ వైద్యులున్నారు. వైద్య కళాశాలలో 50 పడకల ఆసుపత్రి పూర్తయితే సేవలు అక్కడికి తరలించే అవకాశం ఉంది.

**సేవలు వినియోగించుకోవాలి: డాక్టర్ విజయ్, ఆసుపత్రి ఆర్ఎంవో**

ఆధునికీకరణ తరువాత రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చాయి. సాధారణ వైద్యం, శస్త్రచికిత్సలు, ఫిజియోథెరపీ అన్నింట్లోనూ సేవలందిస్తున్నాం. క్యాజువాలిటీలో ఇన్‌ఫెక్షన్లు రాకుండా అధునాతన యంత్రం ఏర్పాటు చేశాం. వేసవి తీవ్రత దృష్ట్యా ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు, కూలర్లు సైతం అందుబాటులో ఉంచాం.

# లీకేజీల 'పురం' పర

సూర్యాపేట : పురపాలికల్లో ఇంటింటికీ శుద్ధజలం అందిస్తామని మిషన్ భగీరథ పైపులైన్లు వేసి నల్లా కనెక్షన్లు ఇచ్చారు. వచ్చేదే తక్కువ.. దానికి తోడు లీకేజీలతో నీరంతా వృథా అవుతోంది. వెరసి పట్టణవాసులు నీటిపాట్లు పడుతున్నారు. ఇక శివారు కాలనీల బాధలు చెప్పలేకుండా ఉన్నాయిజిల్లాలోని పురపాలికల్లో పరిశీలించింది..

**డిమాండ్ మేరకు సరఫరా లేక**

హుజూర్‌నగర్ పురపాలిక పరిధిలో పలు కాలనీలకు 20 రోజులకోసారి నీరు రాని పరిస్థితి. పట్టణానికి 50 ఎంఎల్‌డీలు అవసరం కాగా 30 ఎంఎల్‌డీ మాత్రమే గ్రిడ్ నుంచి సరఫరా జరుగుతోంది. లీకేజీలతో అన్ని ప్రాంతాలకు సరిపోవటం లేదు. హుజూర్‌నగర్ పురపాలికలో 7,350 నల్లా కనెక్షన్లున్నాయి. ఇతర వనరులతో మరో 2,627 కనెక్షన్లకు నీరు అందజేస్తున్నారు. సీతారాంనగర్, అంబేద్కర్ కాలనీ ఇంకా పలు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారానైనా నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

**అల్లాడుతున్న శివారు కాలనీలు**

సూర్యాపేట పట్టణంలోని బాషానాయక్‌తండాలో ఐదేళ్ల కిందట పైపులైన్ నిర్మించినా నేటికీ నీటి సరఫరా జరగటం లేదు. స్థానికంగా బోరునీటిని వినియోగించుకుంటున్నారు. తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. మానసనగర్, అంజనాపురి కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్ తదితర శివారు కాలనీకు నీటి సరఫరా సరిగా జరగటం లేదు. మిషన్ భగీరథ అధికారులు నిత్యం 19 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు. బాషానాయక్‌తండాలో కనెక్షన్ అనుసంధానం చేయించి సరఫరా చేయిస్తామని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

**పైపులైన్లు దెబ్బతిని..**

నేరేడుచర్ల పురపాలికలో విలీన గ్రామాలైన రామగిరి, నర్సయ్యగూడెంలకు నీటి సరఫరా జరగడం లేదు. రామగిరి వద్ద పైప్‌లైన్‌లు దెబ్బతిన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తేనే నీటి సరఫరా జరిగే అవకాశం లేదు. పైప్‌లైన్ పగిలిపోవడంతో నర్సయ్యగూడెంకి చాలాకాలం మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో బోరు నీటితో ట్యాంకు నింపి నీరు సరఫరా చేస్తున్నారు. నర్సయ్యగూడెం పైప్‌లైన్ మరమ్మతులు చేస్తామని భగీరథ ఏఈ శ్రీనాథ్, పురకమిషనర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

**కోదాడలో రోజు విడిచి రోజు**

పట్టణంలో రోజు విడిచి రోజు నీటిని ఇంటింటికి ఇస్తున్నారు. పట్టణానికి మొత్తం 12.55 ఎంఎల్‌డీ నీరు డిమాండ్ ఉన్నప్పటికి కేవలం 6.5 ఎంఎల్‌డీ మాత్రమే వస్తోంది. నీరు సరిపోక బోరు నీటిని కూడా అధికారులు ఇంటింటికి ఇస్తున్నారు. అవి భగీరథ, బోరు, బావుల నీరా అర్థం కావట్లేదని జనం వాపోతున్నారు.

**నీటి లీకేజీలతో తిప్పలు**

తిరుమలగిరి పురపాలికకు మిషన్‌భగీరథ రావాల్సిన నీటి కంటే తక్కువగా వస్తున్నాయి. లీకేజీలు, పైపులైన్ పగుళ్లతో సుందరయ్యకాలనీ, అనంతారంలోని జంగాలకాలనీ, బీసీకాలనీలకు తరచూ నీటి సమస్యలు తలెత్తున్నాయి. వలిగొండ-తొర్రూరు రోడ్డువెడల్పు పనులతో పైపులైన్లు పగిలి బీసీకాలనీకి నీరు రావడం లేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. మార్కెడ్ యార్డు ఎదుట, మల్లీశ్వరి థియేటర్, తహసీల్దార్ కార్యాలయం వెళ్లేదారుల్లో లీకేజీలతో నీరు వృథాగా పోతుంది. మిషన్ భగీరథ సిబ్బందితో త్వరలో లీకేజీలు సరిచేస్తామని పురకమిషనర్ బి.యాదగిరి చెప్పారు.






# పవన్ ఆధ్వర్యంలో ఏపీ సీఎంతో సినీ పెద్దల మీటింగ్

తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పెద్దలు, నిర్మాతలు సీఎం నారా చంద్రబాబు నాయుడిని కలవబోతున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో విజయవాడ ఉండవల్లి నివాసంలో ఈనెల 15, ఆదివారం సాయంత్రం 4 గంటలకు భేటీ కానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశంవుమ కోసం సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానిస్తున్నారు. ఇప్పటి వరకూ 48 మంది సినీ ప్రముఖులకు ఫోన్ ద్వారా సమాచారం. అయితే ఏపీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సినిమాటోగ్రఫీ మంత్రులతో మీటింగ్.. ఏం చర్చించ బోతున్నారో అన్నది ఇప్పుడు ఆసక్తికగా మారింది. సినిమా ఇండస్ట్రీ సమస్యలతోపాటు ఏపీలో షూటింగ్‌లకు అనుమతులు, పన్నుల విధానం, లొకేషన్ సమస్యలు, టికెట్ రేట్లు, ప్రత్యేక ధరలు ఇతర అంశాలపై చర్చలు జరగనున్నాయని తెలుస్తోంది.




## సమస్యలు, ఆర్థిక సవాళ్లను దాటుకుంటూ ముందుకెళ్తున్నాం: సీఎం చంద్రబాబు

అమరావతి: ప్రజల ఆశీర్వాదంతో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ప్రజా పాలనలో ఏడాది పూర్తి చేసుకుందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజల ఆకాంక్షలను తీర్చడం కోసం శక్తి వంచన లేకుండా ప్రతిరోజూ పని చేస్తున్నామన్నారు. "అనేక సమస్యలు, ఆర్థిక సవాళ్లను దాటుకుంటూ ముందుకెళ్తున్నాం. ఏడాది కాలంలోనే పేదల సేవలో, పింఛన్లు, అన్న క్యాంటీన్లు, దీపం-2, తల్లికి వందనం, మత్స్యకార సేవలో.. లాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చాం. మెగా డీఎస్సీతో టీచర్ ఉద్యోగాలు ఇవ్వనున్నాం. పెట్టుబడులతో ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పనకు అడుగులు వేశాం. 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు సహా రైతు సంక్షేమానికి పలు నిర్ణయాలు తీసుకున్నాం. ఈ నెలలోనే 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు ఆర్థిక సాయం అందిస్తాం. ఇరిగేషన్ ప్రాజెక్టు పనులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి ప్రతి ఎకరాకు నీళ్లిచ్చే కార్యక్రమం చేపట్టాం. రాజధాని నిర్మాణం, పోలవరం పనులను మళ్లీ గాడిన పెట్టాం. రైల్వే జోన్ సాధించాం. స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాం. మీ ఆశీర్వాద బలంతో రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని ఈ సందర్భంగా మాట ఇస్తున్నాను. ఏడాది పాలనను విజయవంతం చేయడానికి సహకరించిన, పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను. సుపరిపాలనలో తొలి అడుగు ప్రజల్లో నమ్మకాన్ని, భరోసాను కలిగించింది.. మలి అడుగు మరింత సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఇప్పటివరకూ నా మంచితనాన్ని చూశారు.. ఇకపై ఉపేక్షించను: సీఎం చంద్రబాబు

మంగళగిరి: వైకాపా అధినేత జగన్ తీరుపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత ధైర్యం ఉంటే తెనాలిలో గంజాయి బ్యాచ్‌ను పరామర్శిస్తారని మండిపడ్డారు. ఉండవల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "పొదిలిలో బాధ్యత లేకుండా పర్యటిస్తారా? దేవతల రాజధానిని వేశ్యల రాజధాని అంటారా? రౌడీలను వెంటేసుకొని వెళ్లి రౌడీయిజం చేస్తారా? జగన్ కంటే ఎక్కువ సంక్షేమం చేస్తున్నాం. శాంతి భద్రతల సమస్యలు సృష్టిస్తామంటే కుదరదు. ఇప్పటివరకూ నా మంచితనాన్ని చూశారు.. ఇకపై ఉపేక్షించను. హద్దుమీరితే ఇకపై ఊరుకునేది లేదు. 11 సీట్లకే జనం పరిమితం చేసినా వాళ్లకు బుద్ధి రాలేదు. వైకాపా తీరును సరైన సమయంలో మరోసారి ఆధారాలతో



ఎండగడతా. అమరావతిపై వ్యాఖ్యల నుంచి దృష్టి మళ్లించేందుకే పొదిలిలో దాడులు చేశారు" అని చంద్రబాబు దుయ్యబట్టారు.

# అందుకే వైసీపీ 11 సీట్లకే పరిమితం అయింది..




విజయవాడ: ఏడాది కూటమి పాలనలో ప్రజలకు సంక్షేమంతో పాటు, రాష్ట్ర అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని, గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపోయి... 11 సీట్లకే వారిని పరిమితం చేశారని తెలుగుదేశం ఎమ్మెల్యే బోండా ఉమ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. కూటమిపై నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. సీఎం చంద్రబాబు ప్రణాళిక బద్ధంగా పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. అభివృద్ధి పనులు కూడా ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు.

**వారి కళ్లల్లో ఆనందం చూస్తున్నాం..** గత ప్రభుత్వంలో ఉన్న రోడ్లు.. ఈ ఏడాది పాలనలో ఉన్న రోడ్లు చూస్తేనే ప్రజలకు అర్థమవుతుందని బోండా ఉమ అన్నారు. తప్పకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. చెప్పిన విధంగా పెన్షన్ పెంచి.. ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటింటికి తీసుకువెళ్లి అందిస్తున్నామని చెప్పారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదల ఆకలి నింపుతూ.. వారి కళ్లల్లో ఆనందం చూస్తున్నామని, ప్రతి మహిళకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు.

**అక్కా చెల్లెళ్లకు త్వరలో 18వేలు..** గతంలో అమ్మ ఒడిని అర్థ ఒడిని చేసిన వైసీపీని ప్రజలు ఓడించారని, గురువారం నుంచి అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే.. అంతమందికి రూ. 15 వేలు చొప్పున ఖాతాల్లో వేస్తున్నారని ఎమ్మెల్యే బోండా ఉమ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఆగష్టు 15వ తేదీ నుంచి అమలు చేయనున్నామని చెప్పారు. అక్కా చెల్లెళ్లకు త్వరలో రూ. 18 వేలు కూడా అందచేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను విడతల వారీగా అమల్లోకి తెచ్చామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చే సరికి ఆర్థిక పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని, చంద్రబాబు వంటి సమర్ధవంతమైన నాయకత్వంలో ప్రణాళిక బద్దంగా ముందుకు వెళుతున్నారని చెప్పారు. తొలి యేడాదిలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ముందుకు వెళుతున్నామని, వచ్చే నాలుగేళ్లల్లో కూడా ఏపీ ఆదర్శంగా నిలిచేలా అబివృద్ధి పథంలో ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ప్రజలకు జవాబుదారీ తనంతో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కొత్తగా నేటి నుంచి వితంతు పెన్షన్లను కూడా అందచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరుగుతుందని.. రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బోండా ఉమ వ్యాఖ్యానించారు.



# జూలై 6 నుంచి నెల్లూరులో రొట్టెల పండుగ

నెల్లూరు : మతసామరస్యానికి ప్రతీకగా, రాష్ట్ర పండుగగా నెల్లూరులో ఏటా జరిగే బారా షహీద్ దర్గా రొట్టెల పండుగ జూలై 6వ తేదీన ప్రారంభం కానుంది. ఐదు రోజులపాటు జరిగే ఈ వేడుకను విజయవంతంగా పూర్తి చేసేందుకు బుధవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్ అధికారులతో సమీక్షించారు.




## భారత్ టార్గెట్‌గా కెనడాలో డ్రగ్స్ దందా: 'ప్రాజెక్ట్ పెలికాన్'లో బయటపడిన వాస్తవాలు..!

భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు ఆజ్యం పోసేలా ఖలిస్థానీ సానుభూతిపరులు నిధుల సమీకరణకు కెనడాలో భారీ ఎత్తున డ్రగ్స్ దందాలు నిర్వహిస్తున్నారు. అక్కడి పీల్ రీజనల్ పోలీసులు ప్రాజెక్టు పెలికాన్ పేరిట నిర్వహించిన దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఈ ఆపరేషన్ సందర్భంగా 479 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. దీని విలువ 47.9 మిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా. భారతీయ మూలాలున్న ఏడుగురు సహా మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశారు. అమెరికా-కెనడా మధ్య ఉన్న వాణిజ్య ట్రక్కుల రవాణా మార్గాన్ని వాడుకొంటున్నట్లు గుర్తించారు. వీరికి మెక్సికన్ ముఠాలతో సన్నిహిత సంబంధాలున్నాయని పీల్ పోలీసులు వెల్లడించారు. ఈ మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారం నుంచి వచ్చే సొమ్మును భారత వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ఈక్రమంలో ఆందోళనలు, రెఫరండాల నిర్వహణ, ఆయుధాల కొనుగోళ్లు వంటి వాటికి పాల్పడుతున్నారు. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ మద్దతుతోనే ఈ ఖలిస్థానీ ముఠాలు మెక్సికన్ నుంచి వచ్చే విలువైన కొకైన్ ఎగుమతి చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు అఫ్గానిస్థాన్ నుంచి వచ్చే హెరాయిన్ నుంచే ఐఎస్ఐ కార్యకలాపాలకు నిధులు సేకరిస్తోంది. తాజాగా అరెస్టైన వారిలో యోగేంద్రరాజ(టొరంటో), మన్‌ప్రీత్ సింగ్(బ్రాంప్టన్), ఫిలిప్ టెప్ (హామిల్టన్), అరవింద్ పవార్ (బ్రాంప్టన్), కమర్‌జిత్ సింగ్ (కాలెడాన్) గుర్జీత్ సింగ్ (కాలెడాన్), సత్రజ్ సింగ్ (కేంబ్రిడ్జ్), శివ్ ఓంకార్ సింగ్ (జార్జిటౌన్), హావో టామీ హుయన ఉన్నారు.

**గతేడాది నుంచే నిఘా..** గతేడాది డిసెంబర్‌లో అమెరికాలోని ఇల్లినాయిస్‌లో భారతీయ మూలాలున్న ఇద్దరు కెనడా వాసులను అరెస్టు చేశారు. వీరి వద్ద 1,000 పౌండ్ల కొకైన్ బయటపడింది. దీనిని వారు వోల్వో ట్రక్కులో లోడ్ చేసి తరలిస్తుండగా స్వాధీనం చేసుకొన్నారు. ఇక తాజాగా దాడికి సంబంధించిన దర్యాప్తు 2024 జూన్‌లోనే మొదలైంది. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ట్రక్కులు ప్రయాణించే మార్గాలపై నిఘా ఉంచారు. నవంబర్ నాటికి చాలామంది వ్యక్తులు, ట్రక్కింగ్ కంపెనీ, డ్రగ్స్‌ను దాచే ప్రదేశాలను గుర్తించారు. ఇందుకో కెనడా బోర్డర్ సర్వీస్ ఏజెన్సీ, అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ సాయం తీసుకొన్నారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి-మే మధ్యలో 127 కేజీల కొకైన్‌ను విండ్‌సర్‌లోని అంబాసిడర్ వంతెన వద్ద, 50 కేజీల కొకైన్‌ను పాయింట్ ఎడ్వర్డ్‌లోని బ్లూవాటర్ వంతెన సమీపంలో పీల్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఇక గ్రేటర్ టొరంటో వద్ద కూడా కొంత పట్టుకొన్నారు.




## అమ్మాయిలు బయట జాగ్రత్తగా ఉండండి.. రాయపాటి శైలజ సూచన

అనంతపురం, జూన్ 12: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఓ యువతి హత్య, మరో బాలికపై సామూహిక అత్యాచారం ఘటనలపై మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ స్పందించారు. జిల్లా పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ.. అమ్మాయిలు కూడా జాగ్రత్తగా ఉండాలని... ఏమైనా ఉంటే తల్లిదండ్రులకు చెప్పుకోవాలని అన్నారు. కాలం బాగోలేదని... బయట జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సత్యసాయి జిల్లాలో మైనర్‌పై రెండేళ్లుగా లైంగిక దాడికి పాల్పడ్డారన్నారు. ఈ దారుణ ఘటనలో నిందితులను పట్టుకున్నామని.. మొత్తం 16 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. రామగిరి దళిత మైనర్ బాలిక ఘటనలో పార్టీలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. అలాగే తన్మయి కేసులో మొదట బాలు అనే యువకుడిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారని.. అందుకే బాలుపై పోలీసులు దృష్టి పెట్టారని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు.

**రెండేళ్లుగా లైంగిక దాడి...** సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరిలో దళిత బాలికపై రెండేళ్లుగా కొంతమంది అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికపై కొందరు రెండేళ్లుగా అత్యాచారం చేస్తున్నారు. దీనిని బాలిక తల్లిదండ్రులు పంచాయతీ పెద్దల దృష్టికి తీసుకురాగా.. బాలికకు న్యాయం చేయాల్సిన ఆ పెద్దలు కూడా ఆమెపై అత్యాచారం చేశారు. అంతే కాకుండా బాలికకు రెండు సార్లు అబార్షన్లు కూడా చేయించారు. ఇంతటితో ఆగకుండా బాలిక కుటుంబాన్ని కొండగుట్టల్లో దాచారు. ఎట్టకేలకు మైనర్‌కు జరిగిన అన్యాయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

**విద్యార్థిని దారుణ హత్య...** మరోవైపు అనంతపురం జిల్లాలో తన్మయి అనే ఇంటర్మీడియట్ విద్యార్థిని హత్య ఉదంతం కూడా సంచలనం సృష్టించింది. తన్మయి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఉరవకొండ ప్రధాన రహదారిలో కూడేరు వద్ద మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు తన్మయి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఆ మృతదేహం తమ కుమార్తెదే అని గుర్తించిన పేరెంట్స్ బోరున విలపించారు. అయితే తన్మయిని నరేష్ అనే వ్యక్తి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. తనని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడం వల్లే తన్మయి తలపై బీర్ బాటిల్‌తో కొట్టి నరేష్ హత్య చేశాడని పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయ్యింది. అయితే మందు బాబులకు అడ్డాగా మారిన ముళ్లపొదల్లో తన్మయి డెబ్ బాడీ ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నరేష్‌తో పాటు మరికొంత మంది కలిసి తన్మయిని హత్య చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగిన ఈ రెండు ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా సీరియస్ అయ్యారు. ఈ రెండు కేసుల్లో నిందితులను వదలొద్దని, కఠిన శిక్ష పడేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# మురికి వ్యాఖ్యల కేసులో కృష్ణంరాజుకు 14 రోజుల రిమాండ్

గుంటూరు: రాజధాని అమరావతి మహిళలపై జుగుప్సాకర వ్యాఖ్యలు చేసిన కేసులో పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజుకు మంగళగిరి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ నెల 26వరకు అతడికి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిన్న విశాఖలో అరెస్టు చేసిన తుళ్లూరు పోలీసులు అతడిని గురువారం మధ్యాహ్నం మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ నెల 26వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో అతడిని గుంటూరు జైలుకు తరలించారు.

ఇదే కేసులో ఇప్పటికే సాక్షి టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ నెల 6వ తేదీన సాక్షి టీవీ ఛానల్‌లో ప్రసారమైన 'కేఎస్ఆర్ లైవ్ షో' చర్చా కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణంరాజు అమరావతి మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా అత్యంత హేయమైన వ్యాఖ్యలు చేసిన



సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అనేక పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు అందాయి.

# అహ్మదాబాద్ దుర్ఘటన .. ఏపీలో కూటమి ప్రభుత్వం వేడుక వాయిదా

అమరావతి: అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈరోజు సాయంత్రం తలపెట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి గురువారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలన స్వర్ణాంధ్రప్రదేశ్' పేరుతో రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ఉత్సవం నిర్వహించాలని నిర్ణయించింది. గుంటూరు జిల్లా అమరావతిలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం ఏం సాధించింది, రాబోయే నాలుగేళ్లలో ఎలాంటి లక్ష్యాలు సాధించాలనుకుంటోంది, ఏ విజన్‌తో అడుగులు ముందుకు వేయనుందన్న అంశాలు ప్రజలకు వివరించేలా ఈ కార్యక్రమం రూపొందించారు. సుపరిపాలన, సమ్మిళిత వృద్ధికి పునరంకితం అయ్యేలా ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, స్వర్ణాంధ్ర విజన్ కార్యాచరణ ప్రణాళిక జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి సభ్యులు, సచివాలయంలోని కీలక అధికారులను ఆహ్వానించారు. ఇవాళ మధ్యాహ్నం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఘోర విమన ప్రమాదం జరగడంతో ఈ కార్యక్రమం వాయిదా పడింది.

## సాగర కన్య వయసు 50 కాదు 20

కొందరికి వయసు కేవలం నంబర్ మాత్రమే. అది ఎప్పటికీ ప్రభావితం చేయదు. మనసుండాలే కానీ ఆస్వాధనకు అసలు వయసుతో పనేంటి? ఇదిగో ఇక్కడ శిల్పా శెట్టి పరిణతి ఎప్పుడూ మనసులను గెలుచుకుంది. సాగరకన్యగా తెలుగు యువత గుండెల్లో కొలువు దీరిన శిల్పాజీ.. బిజినెస్‌మేన్ రాజ్ కుంద్రాను పెళ్లాడినప్పుడు చాలా గుండెలు ఆగిపోయాయి. కానీ ఆ జంట అన్యోన్య దాంపత్యం, ఇద్దరు పిల్లలకు మామ్ డాడ్ గా ఫ్యామిలీ లైఫ్ గోల్స్ ని ఫిక్స్ చేయడంలో ఎప్పుడూ విఫలం కాలేదు. ఎన్నో వివాదాలు.. అన్నిటిలో భర్త వెంటే శిల్పా శెట్టి. ఇటీవల సుదూర తీరాలకు వెకేషన్ కి వెళ్లిన శిల్పా శెట్టి రేర్ ఫోటో క్లిక్స్ ని షేర్ చేసింది. అయితే వీటిలో వైట్ అండ్ వైట్ టూపీస్ లో ఫోటోషూట్ అభిమానులను ఎగ్జయిట్ చేస్తోంది.



ఈ ఫోటోషూట్‌లో శిల్పా శెట్టి నేటి తరానికి కూడా చెమటలు పట్టించే భంగిమలతో చెలరేగిపోయింది. బాలీవుడ్ యోగా క్వీన్ శిల్పా శెట్టికి వయస్సు కేవలం ఒక సంఖ్య మాత్రమే! ఈ బ్యూటీకి ఇప్పుడే 50 ఏళ్లు వచ్చాయి కానీ తన శరీరం 20 ఏళ్ల వద్దనే ఆగిపోయింది అంటూ అభిమానులు కాంప్లిమెంట్లు ఇస్తున్నారు. వైట్ అండ్ వైట్ టూపీస్ లో శిల్పాజీ ఫోజులు యూత్ లో గుబులు పుట్టిస్తున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే, ఇంతకుముందు రోహిత్ శెట్టి సింగం ఎగైన్‌లో కనిపించింది. ఓవైపు సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు శిల్పాశెట్టి డ్యాన్స్ రియాలిటీ షోలతో భారీగా ఆర్జిస్తోంది.

## సీత అడల్ట్ సిరీస్‌తో తప్పు చేస్తోందా?

కేవలం నటిగానే కాదు ఎంటర్ ప్రెన్యూర్ గాను ఆలియా భట్ ప్రణాళికలు ఆశ్చర్యపరుస్తున్నాయి. తన సంపాదనను తెలివిగా వ్యాపారంలో పెట్టుబడులు పెడుతూ భారీ లాభాల్ని ఆర్జిస్తోంది. మరోవైపు సినీనిర్మాతగాను ఆలియా విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఇంతకుముందు షారూఖ్ తో కలిసి డార్లింగ్స్ అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ సినిమా విజయం సాధించింది. ఇటీవల జిగ్రా అనే చిత్రాన్ని నిర్మించినా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఆలియా ఇకపైనా



సినీనిర్మాణంలో సీరియస్ గా ముందుకు సాగుతోంది. తాజా సమాచారం మేరకు.. అలియా భట్ పూర్తిగా కొత్తవారితో అడల్ట్ వెబ్ సిరీస్‌ను నిర్మించబోతున్నట్లు సమాచారం. దీనికి ఎవరు దర్శకత్వం వహిస్తారు? అనేదానిపై స్పష్టత లేదు. అడల్ట్ సిరీస్ కథ, కాన్సెప్ట్ విన్న తర్వాత ఆలియా నో చెప్పలేకపోయారట. అయితే ఈ సిరీస్ లో బోలి కంటెంట్ ఆశ్చర్యపరుస్తుందని చెబుతున్నారు. ఆర్.ఆర్.ఆర్ లో సీతగా నటించిన ఆలియాకు సౌత్ లో ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. కానీ అందుకు విరుద్ధమైన కంటెంట్ ని ఆలియా ప్రోత్సహించడం ఆశ్చర్యకరమే. డార్లింగ్స్, జిగ్రా తర్వాత ఈ వెబ్ సిరీస్ తో నిర్మాతగా మరో అడుగు ముందుకు వేసేందుకు ప్రయత్నిస్తోంది. కానీ కంటెంట్ పరంగా ఎలాంటి విమర్శల్ని అయినా ఎదుర్కోవాల్సి ఉంటుంది. మరోవైపు ఆలియా నటిగాను తన కెరీర్ పైనా ఫోకస్ చేసింది. తదుపరి శివ్ రావైల్ దర్శకత్వం వహించిన స్పై యాక్షన్ డ్రామా ఆల్ఫాలో నటిస్తోంది. భారతీయ తెరపై లేడీ స్పై విన్యాసాలు వీక్షించేందుకు అభిమానులు ఉత్కంఠగా వేచి చూస్తున్నారు.




## షారుక్- సల్మాన్ కోసం ఎన్టీఆర్, హృతిక్



బాలీవుడ్ క్రేజీ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ పేరుతో భారీ యాక్షన్ ఎంటర్ టైనర్‌లని తెరపైకి తీసుకొస్తూ ఆడియన్స్‌ని థ్రిల్ చేస్తున్న విషయం తెలిసిందే. సల్మాన్ ఖాన్ నటించిన ఏక్ థా టైగర్%-%తో ఈ స్పై యూనివర్స్‌ని 2012లో మొదలు పెట్టారు. ఆ తరువాత సల్మాన్‌తోనే 'టైగర్ జిందాహై'ని నిర్మించారు. ఆ తరువాత హృతిక్ రోషన్, టైగర్‌ష్రాఫ్‌ల కాంబినేషన్‌లో వార్‌ని నిర్మించారు. ఇక షారుక్ ఖాన్ కంబ్యాక్ మూవీగా తెరకెక్కిన పఠాన్‌ని కూడా ఇదే యూనివర్స్‌లో భాగంగా నిర్మించారు. సిద్ధార్ధ్ ఆనంద్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ షారుఖ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లని రాబట్టిన సినిమాగా నిలవడమే కాకుండా ఆయన కెరీర్‌కి మరింత బూస్ట్‌ని అందించింది.

దీని తరువాత మళ్లీ సల్మాన్ ఖాన్‌తో టైగర్ 3ని రూపొందించారు. ఇప్పటి వరకు వచ్చిన స్పై యూనివర్స్ మూవీస్ స్థాయిలో ఇది వసూళ్లని రాబట్టలేకపోయినా ఫరవాలేదు అనిపించింది. ఇప్పుడు ఇదే యూనివర్స్‌లో ఎన్టీఆర్, హృతిక్‌లతో %-%వార్ 2%-%ని నిర్మించిన విషయం తెలిసిందే. ఆగస్టు 14న భారీ స్థాయిలో రిలీజ్‌కు రెడీ అవుతున్న నేపథ్యంలో యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో ఓ భారీ క్రేజీ మూవీకి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. వార్ 2 తరువాత ఇదే యూనివర్స్‌లో ఆల్ఫాని తెరకెక్కించనున్న యష్ రాజ్ ఫిల్మ్స్ ఆ తరువాత షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్‌ల కలయికలో పఠాన్ వర్సెస్ టైగర్‌ని తెరపైకి తీసుకురానున్నారని బాలీవుడ్ మీడియా కథనం. పఠాన్‌లో సల్మాన్ ఖాన్ గెస్ట్ రోల్‌లో కనిపించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే పఠాన్ వర్సెస్ టైగర్‌లో హృతిక్ రోషన్‌తో పాటు ఎన్టీఆర్, జాన్ అబ్రహం, అలియాభట్ గెస్ట్ క్యారెక్టర్లలో కనిపిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఈ భారీ మల్టీస్టారర్ యాక్షన్ ఎంటర్ టైనర్‌ని వార్, పఠాన్ చిత్రాల దర్శకుడు సిద్ధార్ధ్ ఆనంద్ తెరకెక్కించనున్నాడట. ఈ వార్తలు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాజెక్ట్ ఇప్పట్లో కష్టమని, అసలు ఈ ప్రాజెక్టే లేదని ప్రచారం మొదలైంది. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, పఠాన్ వర్సెస్ టైగర్ ప్రాజెక్ట్ ఉంటుందని జాతీయ మీడియా స్పష్టం చేసింది. ఈ వార్త విని సల్మాన్, షారుక్ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.

## ఘాజి దర్శకుడితో గోపీచంద్.. గోపీచంద్ నెవ్వర్ బిఫోర్ గ్లింప్స్!




టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ ఇప్పుడు మరో ప్రతిష్టాత్మక చిత్రంతో అలరించేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఐబీ 7, ఘాజీ వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న సంకల్ప్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాసా చిట్టూరి పవన్ కుమార్ సమర్పణలో భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ లో పూజా కార్యక్రమాలు జరగ్గా.. ఇప్పుడు మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇండియన్ హిస్టరీలో కీలకమైన, మరచిపోలేని సంఘటనలతో రూపొందిస్తున్న ఆ సినిమాలో గోపీచంద్ నెవ్వర్ బిఫోర్ లుక్ లో కనిపించనున్నట్టు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేసి అంచనాలు పెంచారు. 7వ శతాబ్దం నాటి సంఘటనల ఆధారంగా సినిమా తెరకెక్కుతుండగా.. మేకర్స్ తాజాగా క్రేజీ అప్డేట్ ఇచ్చారు. నేడు గోపీచంద్ బర్త్ డే సందర్భంగా విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ తో పాటు గ్లింప్స్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఆ రెండూ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మంచి రెస్పాన్స్ అందుకుని సినిమాపై భారీ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. పోస్టర్ ను గోపీచంద్ వేరే లెవెల్ లో ఉన్నారు. గోపీచంద్ పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, నుదుటన సింధూరం, చేతిలో కత్తి, దీర్ఘంగా చూస్తున్న కళ్లతో యోధుడుగా కనిపించారు. యుద్ధభూమి బ్యాక్ గ్రౌండ్ తో ఉన్న పోస్టర్.. పవర్ ఫుల్ గా ఉంటూ అబ్బురపరుస్తుంది. నెటిజన్లు, సినీ ప్రియులు.. పోస్టర్ అదుర్స్ అని చెబుతున్నారు. మరోవైపు, గ్లింప్స్ అయితే ఓ రేంజ్ లో ఉందని అంటున్నారు. మంచు కొండల సీన్ కూల్ గా స్టార్ట్ అవుతుంది. అప్పుడే గూడారం నుంచి యోధుడుగా గోపీచంద్ బయటకు వస్తారు. తన గుర్రంతో ఆత్మీయంగా గడుపుతారు. బ్యాక్ గ్రౌండ్ లో వస్తున్న ధీర సాంగ్.. అదిరిపోయింది. విజువల్స్ చాలా రిచ్ గా ఉండి బాగున్నాయి. మొత్తానికి సినిమాలో గోపీచంద్ ఎప్పుడూ చూడని పాత్రలో కనిపిస్తారని మరోసారి క్లారిటీ వచ్చేసింది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ కాశ్మీర్ లో ఏప్రిల్ లో కంప్లీట్ చేశారు మేకర్స్. కొత్త షెడ్యూల్ ను హైదరాబాద్ లో స్టార్ట్ చేశారు. భారీ సెట్ లో ఇప్పుడు చిత్రీకరణ జరుగుతోంది. క్యాస్టింగ్ తో పాటు సాంకేతిక సిబ్బంది గురించి మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

## సితారకు సంయుక్త సెంటిమెంట్ పట్టుకుందా?

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. అభిరుచి గల నిర్మాతగా మంచి పేరుతెచ్చుకున్న సూర్యదేవర నాగవంశీ విభిన్నమైన కథలతో అటు పెద్ద చిత్రాలు, ఇటు యూత్ మెచ్చే సినిమాలు చేస్తూ నిర్మాతగా ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రస్తుతం యంగ్ హీరోలతో సినిమాలు చేస్తూనే క్రేజీ స్టార్లతో సినిమాలు చేస్తున్నాడు. విజయ్ దేవరకొండతో కింగ్‌డమ్ మూవీని నిర్మిస్తున్న సూర్యదేవర నాగవంశీ త్వరలో మరో భారీ మల్టీలింగ్వల్ మూవీకి శ్రీకారం చుట్టబోతున్నారు. దీనికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహించనున్నారు. ఇదే బ్యానర్‌లో నితిన్‌తో రంగ్ దే, ధనుష్‌తో సార్, దుల్కర్ సల్మాన్‌తో లక్కీ భాస్కర్ వంటి వరుస విజయాల్ని దక్కించుకుని హ్యాట్రిక్ హిట్‌ని సొంతం చేసుకున్నారు.



తాజా ప్రాజెక్ట్ సితారలో వెంకీ అట్లూరికి నాలుగవ సినిమా కాబోతోంది. ఇందులో సూర్య హీరోగా నటించబోతున్నాడు. ఇప్పటికే స్టోరీ విన్న సూర్య ఇందులో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడట. ఇందులో సూర్యకు జోడీగా ఇద్దరు క్రేజీ హీరోయిన్‌లు నటించబోతున్నారు. ఓ హీరోయిన్‌గా మిస్టర్ బచ్చన్ ఫేమ్ భాగ్యశ్రీ బోర్సేని అనుకుంటున్నారట. మరో నాయిక పాత్ర కోసం డ్రాగన్ ఫేమ్ కయదు లోహర్‌ని పరిశీలిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఆ క్యారెక్టర్ కోసం కయదును కాకుండా సంయుక్త మీనన్‌ని తీసుకోవాలని సితార వంశీ భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. సితారలో సంయుక్త ఇప్పటి వరకు రెండు సినిమాల్లో నటించింది. భీమ్లానాయక్‌లో రానాకు జోడీగా కనిపించిన సంయుక్త మీనన్ ఆ తరువాత సార్ మూవీలో ధనుష్‌కు జోడీగా నటించింది. ఇప్పుడు సూర్య ప్రాజెక్ట్‌కు ఫైనల్ అయితే సితార తనకిది హ్యాట్రిక్ ఫిల్మ్ కానుంది. ఒక బ్యానర్‌లో వరుసగా ఒకే హీరోతో సినిమాలు చేసిన వారున్నారు. కానీ ఒకే హీరోయిన్‌తో మూడు సినిమాలు చేసిన సంస్థలు టాలీవుడ్‌లో చాలా అరుదు. ఆ విషయంలో సితార ముందు నిలుస్తోందని, సితారకు సంయుక్త సెంటిమెంట్ పట్టుకుందని టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది

## కీర్తి లీగ్ లోనే ఉంది.. రుక్మిణి ఛాన్స్ కొట్టేసింది..!

మహానటిగా సినీ ప్రియుల మన్నలను పొందిన కీర్తి సురేష్ నటిగా తనని తాను ప్రూవ్ చేసుకుంటూ వచ్చింది. ఎలాంటి ఛాలెంజింగ్ రోల్ అయినా కూడా తన దాకా వస్తే పాత్రలో పరకాయ ప్రవేశం చేసి అదరగొట్టేస్తుంది అమ్మడు. ఐతే పెళ్లి తర్వాత ఎవరికైనా అవకాశాలు కాస్త సన్నగిల్లుతాయన్న పరిస్థితి ఉంటుంది. ఐతే కీర్తి సురేష్ విషయంలో కూడా అలాంటిది ఉంటుందని అనుకున్నారు. కానీ ఆమెకు వస్తున్న ఆఫర్లు చూస్తే అది నిజం కాదన్నదని అర్థమవుతుంది. ముఖ్యంగా పెళ్లైన కీర్తి సురేష్ ఒక ఆరు నెలలుగా ఎలాంటి కొత్త సినిమాకు సైన్ చేయలేదు. ఐతే ఆ టైం లో కీర్తి పని అయిపోయిందని అనుకున్నారు అందరు. కానీ వరుసగా ఆమె సైన్ చేసిన సినిమాల గురించి బయటకు వస్తున్న న్యూస్ లు చూసి అందరు షాక్ అవుతున్నారు. కీర్తి సురేష్ తెలుగులో రెండు భారీ సినిమాలకు సైన్ చేసిందని తెలుస్తుంది. కీర్తి ఇప్పటికే విజయ్ దేవరకొండతో కలిసి జత కడుతున్నట్టు టాక్. విజయ్ దేవరకొండతో రవికిరణ్ కోలా డైరెక్షన్ లో వస్తున్న సినిమాలో కీర్తి లక్కీ ఆఫర్ అందుకుంది. ఈ



సినిమాలో ముందు సప్త సాగరాలు దాటి హీరోయిన్ రుక్మిణి వసంత్ ని తీసుకోవాలని అనుకున్నారట. ఆ సినిమా కన్నడలో హిట్టైనా తెలుగులో ఆమెకు సూపర్ ఫ్యాన్స్ ఏర్పడ్డారు. ఈ క్రమంలో రుక్మిణికి రౌడీ హీరో సినిమా ఛాన్స్ వస్తుందని అనుకున్నారు. కానీ ఇప్పుడు రుక్మిణి కాదు ఆ అవకాశం కీర్తి సురేష్ కే ఇచ్చారని తెలుస్తుంది. ఇదే కాదు కీర్తి సురేష్ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ వచ్చింది. బలగం సినిమా చేసిన వేణు యెల్దండి నెక్స్ట్ చేయబోతున్న ఎల్లమ్మ సినిమాలో కీర్తి సురేష్ ఆఫర్ పట్టేసిందట. ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు చాలా వెయిట్ ఉంటుందని తెలుస్తుంది. తప్పకుండా ఈ సినిమాలతో అమ్మడు అదరగొట్టబోతుందని టాక్. ఇవే కాదు స్టార్ లీగ్ లో తాను ఉన్నానని అనేలా అమ్మడు ప్రూవ్ చేసుకుంటుంది. తమిళ్ లో మొన్నటిదాకా సినిమాలు చేసిన కీర్తి సురేష్ తెలుగులో చివరగా భోళా శంకర్ సినిమా చేసింది. దసరాలో వెన్నెల పాత్రలో ఇంప్రెస్ చేసిన కీర్తి భోళా శంకర్ తో నిరాశపరచింది. ఇక ఆ తర్వాత నెక్స్ట్ సినిమాలతో మరోసారి ఆకట్టుకోబోతుంది.




అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనపై కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటన చేసింది. ఈ ప్రమాదంలో చాలా మంది మరణించినట్లు వెల్లడించింది. "అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఘటన మాటలకందని పెను విషాదం. ఇప్పటివరకు ఉన్న అప్‌డేట్ ప్రకారం ఇందులో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. మృతుల్లో ఎక్కువ మంది విదేశీయులు ఉన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. ఘటనకు సంబంధించిన అప్‌డేట్స్‌ను సంబంధిత శాఖకు ఎప్పటికప్పుడు పంచుకుంటాయని పేర్కొన్నారు. ప్రాణ నష్టంపై ఇప్పుడు కచ్చితమైన అంచనాకు రాలేమని, పూర్తి వివరాలకు మరికొంత సమయం పడుతుందని ఆయన తెలిపారు.

**అహ్మదాబాద్‌లో కూలిన ఎయిరిండియా విమానం...** అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఏఐ-171 విమానం కాసేపటికే కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో అందులో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. వీరిలో 169 మంది భారతీయులు.. 53 మంది బ్రిటన్ పౌరులు. ప్రయాణికుల్లో గుజరాత్ మాజీ సీఎం, భాజపా నేత విజయ్ రూపానీ కూడా ఉన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై చంద్రబాబు, రేవంత్ దిగ్భ్రాంతి

అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై తెలుగు రాష్ట్రాల సీఎంలతో పాటు పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గుజరాత్ అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఏఐ-171 విమానం కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో దానిలో 242 మంది ప్రయాణికులు ఉన్నారు.

**విమాన ప్రమాదం దిగ్భ్రాంతికి గురిచేసింది: ఏపీ సీఎంచంద్రబాబు...** అహ్మదాబాద్ విమాన ప్రమాదం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రార్థిస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

**సహాయక చర్యలు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి...** అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన విమానం ప్రమాదానికి గురవడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బంది క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయక చర్యలు వేగవంతం చేయాలని కోరారు.

**బాధిత కుటుంబాలకు అండగా ఉండాలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..** "అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బంది కోసం ప్రార్థిస్తున్నాను. ప్రమాద ఘటనపై అధికారిక సమాచారం కోసం ఎదురు చూస్తున్నాం. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అందరూ అండగా ఉండాలి. ఈ ఆందోళనకరమైన సమయంలో అందరి మద్దతు వారికి బలం చేకూరుస్తుందని ఆశిస్తున్నా" అని పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

**దిగ్భ్రాంతికి గురి చేసింది: మంత్రి నారా లోకేశ్...** అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. సహాయ చర్యలు వేగంగా జరగాలని కోరుకుంటున్నా అని లోకేశ్ ట్వీట్ చేశారు.




ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో అకాల వర్షం ఆరుగురు రైతులను పొట్టనబెట్టుకుంది. రెండు రోజులుగా అడపాదడపా కురిసిన వర్షాలతో విత్తనాలు వేసేందుకు సిద్ధమైన రైతుల కుటుంబాల్లో విషాదం నింపింది. ఏజెన్సీలోని గాదిగూడ మండలం పిప్పిరిలో 14 మంది రైతులు వ్యవసాయ కూలీలతో కలిసి మొక్కజొన్న విత్తులు వేసే క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. వర్షం నుంచి రక్షణ కోసం పొలంలోనే ఉన్న కర్రలతో ఏర్పాటు చేసిన గుడిసెలోకి అందరు వెళ్లారు. అదే సమయంలో గుడిసెపై పిడుగు పడింది. ఈ ఘటనలో పెందూర్ మాదర్రావు(45), సంజన(22), మంగం భీంబాయి (40), సిడాం రాంబాయి (45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన 10 మందిని తొలుత ఝరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఆ తరువాత రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. జిల్లాలోని బేల మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో పడిన పిడుగుపాట్లకు ఇద్దరు మహిళలు మృతిచెందారు. సాంగిడిలో పొలం పనులు చేస్తున్న నందిని (30), సోన్కాస్‌లో పత్తి విత్తనాలు వేస్తున్న సునీత(35)పై పిడుగు పడడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయం నేల తల్లికి నమస్కరించి పొలం పనులకు వెళ్లినవాళ్లు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాయి. ఉట్నూర్ మండలం కుమ్మరితాండలో వ్యవసాయ పనులు చేస్తున్న ముగ్గురు రైతులు రహదారిపై వెళ్తున్న దాదాపు 15 మంది బాటసారులు.. వర్షం రావడంతో పొలంలోని పశువుల పాకలోకి వెళ్లారు. ఆ సమయంలో పిడుగుపడటంతోనే కుమ్మరితాండలోని ఒకే కుటుంబానికి చెందిన రైతులు బోకన్ ధన్‌రాజ్ (27), నిర్మల (36), టోకన్ కృష్ణబాయి (30)లకు గాయాలయ్యాయి. తాంసీ మండలం బండలానాగాపూర్లోని రామాలయంపై పిడుగు పడటంతో పైనున్న ఆలయం గోపురం స్వల్పంగా ధ్వంసమైంది.




హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అందులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. కేటీఆర్, కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను అసెంబ్లీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తామన్నారు.




హైదరాబాద్: బంగారం ధర మళ్లీ పెరుగుతోంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, డాలర్ క్షీణత వంటి కారణాలతో అంతర్జాతీయంగా పసిడి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. దీన్ని అనుసరించి దేశీయ విపణిలో పుత్తడి ధర మళ్లీ రూ.లక్ష మార్క్ దాటింది. హైదరాబాద్ మార్కెట్లో గురువారం 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,00,210గా ఉంది. అటు కిలో వెండి ధర రూ.1,08,700 చేరుకుంది. గురువారం నాటి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీ ట్రేడింగ్‌లో 10 గ్రాముల పుత్తడి ధర రూ.97,650గా ఉంది. క్రితం సెషన్ ముగింపుతో (రూ.96,704) పోలిస్తే ధర 0.97శాతం పెరగడం గమనార్హం. అటు అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర 0.6 శాతం పెరిగి 3,372.46 డాలర్లుగా ఉంది. యూఎస్ గోల్డ్ ఫ్యూచర్స్‌లోనూ పసిడి ధర 1.5శాతం మేర పెరిగింది. అమెరికా డాలర్ విలువ క్రమంగా బలహీనపడుతోంది. రెండు నెలల కనిష్ఠానికి పడిపోయింది. దీంతో విదేశీ కొనుగోలుదారులు బులియన్ మార్కెట్‌పై దృష్టిపెట్టారు. అటు మధ్యప్రాచ్యంలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో బంగారంలో పెట్టుబడులు పెట్టడం శ్రేయస్కరమని మదుపర్లు భావిస్తున్నారు. "అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, అమెరికా-చైనా వాణిజ్య ఒప్పందం వంటి కారణాలతో పుత్తడికి డిమాండ్ పెరిగింది. ఇక, కేంద్ర బ్యాంకులు కూడా పసిడిని కీలకమైన రిజర్వ్ ఆస్తిగా భావిస్తూ కొనుగోళ్లు పెంచుతున్నాయి. దీంతో బంగారం ధర పరుగులు పెడుతోంది" అని ఇండియా బులియన్ అండ్ జువెల్లర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అక్షా కాంబోజ్ వెల్లడించారు.




# తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభమైన పాఠశాలలు.. విద్యార్థుల సందడి

తెలుగు రాష్ట్రాల్లో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం నేటి నుంచి తెరుచుకున్నాయి. చిన్నారుల రాకతో ఏపీ, తెలంగాణల్లోని విద్యాసంస్థల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఏపీ ప్రభుత్వం 'తల్లికి వందనం' నిధులను జమచేయనుంది.

# కాళేశ్వరం ఈఈ రిమాండ్‌కు తరలింపు..




నీటిపారుదల శాఖకు చెందిన కాళేశ్వరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్‌ను రిమాండ్‌కు తరలించారు. మొత్తం 13 ప్రాంతాల్లో సోదాలు చేసిన ఏసీబీ అధికారులు.. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసులో ఏసీబీ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయనను గురువారం తెల్లవారుజామున చంచల్‌గూడా జైలుకు తరలించారు.

కాగా ఆయన బ్యాంకు లాకర్లను ఓపెన్ చేయడానికి ఏసీబీ అధికారులు కస్టడీకి కోరనున్నారు. రూ. వందల కోట్లు అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఇప్పటికే ఏసీబీ గుర్తించింది.

**ఆదాయానికి మించిన ఆస్తులు..** కాగా నీటిపారుదల శాఖకు చెందిన అవినీతి తిమింగలం ఏసీబీ వలకు చిక్కింది. చొప్పదండి డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పనిచేస్తున్న నూనె శ్రీధర్‌ను ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆయన అక్రమాస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైనే ఉంటుందని సమాచారం. శ్రీధర్‌తో పాటు అతని బంధువులు, సన్నిహితులకు సంబంధించి.. హైదరాబాద్, కరీంనగర్, బెంగళూరులో 13 చోట్ల బుధవారం ఉదయం ఏకకాలంలో తనిఖీలు ప్రారంభించారు. కరీంనగర్‌లో శ్రీధర్‌ను అదుపులోకి తీసుకొని హైదరాబాద్ తరలించారు. బెంగళూరులో నాలుగు చోట్ల, హైదరాబాద్‌లో ఆరుచోట్ల ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. కరీంనగర్‌లోని కాళేశ్వరం ప్రాజెక్టు కార్యాలయంలోనూ తనిఖీలు నిర్వహించారు. శ్రీధర్ అక్రమార్జనకు సంబంధించి భారీగానే ఆస్తులను గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన గాయత్రి పంప్‌హౌస్ బాధ్యతలను శ్రీధర్ చూసేవారని, అక్కడ ఏర్పాటు చేసిన బాహుబలి మోటార్ల కొనుగోళ్లలో ఆయన కమీషన్లు తీసుకున్నారన్న ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. చొప్పదండి నియోజకవర్గంలోని రామడుగు మండలంలో నిర్మించిన భారీ పంప్‌హౌస్ బాధ్యతలు కూడా శ్రీధర్ చూశారని తెలుస్తోంది.

**శ్రీధర్ ఆస్తుల జాబితాలోని వివరాలు..** హైదరాబాద్‌లోని మలక్‌పేటలో విలాసవంత మైన నాలుగంతస్తుల భవనం, షేక్‌పేటలో ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీ స్కై హైలో 4,500 చదరపు అడుగుల ఫ్లాట్, తెల్లాపూర్‌లోని మరో ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీ ఉర్జిత్ ఎన్‌క్లేవ్‌లో లగ్జరీ విల్లా, వరంగల్‌లో జీం3 భవనం, కరీంనగర్‌లో మూడు ఫ్లాట్లు, ఒక ఇండిపెండెంట్ ఇల్లు, అమీర్‌పేటలోని వాణిజ్య సముదాయంలో ఆస్తులు, 16 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లోని అత్యంత ఖరీదైన కమ్యూనిటీల్లో 19 ఇళ్ల స్థలాలు, కరీంనగర్‌లోని పలు హోటళ్లలో వ్యాపార భాగస్వామ్యానికి సంబంధించి డాక్యుమెంట్లను గుర్తించామని ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ తెలిపారు. అలాగే రెండు కార్లు, బ్యాంకు డిపాజిట్లు, లాకర్లను గుర్తించామని త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఈ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. మలక్‌పేటలో నివసిస్తున్న శ్రీధర్ మార్చి 6న తన కుమారుడి వివాహాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్ తరహాలో థాయ్‌లాండ్‌లో అత్యంత ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు హైదరాబాద్ శివార్లలోని ఓ ఫాంహౌస్‌లో హల్దీ, సంగీత్ ఫంక్షన్ చేశారు. మార్చి 9న నాగోలులోని శివం కన్వెన్షన్‌లో కుమారుడి రిసెప్షన్ వేడుకలు నిర్వహించారు. కుమారుడి పెళ్లికి రూ. కోట్లు ఖర్చుపెట్టడంతో ఆయనపై ఏసీబీకీ ఫిర్యాదులు అందాయి. శ్రీధర్ ఇరిగేషన్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడిగా కూడా పనిచేస్తున్నారు.

# సినీనటి కల్పికపై కేసు నమోదు..




టాలీవుడ్ నటి కల్పికకు ఊహించని షాక్ తగిలింది. ఆమెపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం 324(4), 352, 351(2) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రిజం పబ్‌లో బిల్ పే చేయకుండా సిబ్బంది పట్ల అసభ్యంగా ఆమె ప్రవర్తించారు. ప్లేట్స్ విసిరేయడం, సిబ్బందిని బాడీ షేమింగ్ చేయడం, బూతు పురాణాలు తిట్టినందుకు ప్రిజం పబ్ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. పోలీసుల సమక్షంలోనే హంగామా సృష్టించారంటూ ఫిర్యాదు చేశారు. దీంతో గచ్చిబౌలి పోలీసులు కోర్టు అనుమతితో నటి కల్పికపై కేసు నమోదు చేశారు.

**వివాదంలో నటి కల్పిక...** కాగా టాలీవుడ్ నటి కల్పిక మరో సారి వివాదంలో చిక్కుకున్నారు. గత నెల (మే) 29న ప్రిజం పబ్‌లో పుట్టిన రోజు సందర్భంగా నటి కల్పిక తన స్నేహితులకు పార్టీ ఇచ్చారు. ఈ క్రమంలో కేకు విషయంలో పబ్ సిబ్బంది.. నటి కల్పిక మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో పబ్ యాజమాన్యంపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా.. బిల్ పే చేయకుండా సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు ప్రిజం పబ్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పబ్‌లో జరిగిన గొడవను యాజమాన్యం రికార్డు చేసింది. దీనికి సంబంధించిన వీడియోలను పోలీసులకు అందించింది.




గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొన్ని చానళ్లలో ఒక వార్త నడుస్తోందని, రాజాసింగ్ వేరే పార్టీలో వెళతారా.. వేరే పార్టీని తీసుకొని వస్తారా.. లేక వేరే పార్టీ పెడతారా అనే వార్తలు వస్తున్నాయని అన్నారు. దీనిపై స్పందించిన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో తాను పార్టీ నుంచి సస్పెండ్ అయ్యాయని.. 14 నెలలు పార్టీకి దూరంగా ఉన్నానని అన్నారు. అప్పుడే తాను వేరే పార్టీలోకి పోలేదని.. వేరే పార్టీని తీసుకొని రాలేదని.. వేరే పార్టీ పెట్టలేదని రాజా సింగ్ చెప్పారు.

**వారిని వదిలిపెట్టను...** తాను బీజేపీ తప్ప వేరే పార్టీలోకి వెళ్లనని ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు. తనతో కొంతమంది ఆట ఆడుతున్నారని.. తాను వేరే పార్టీలోకి వెళ్లనని వాళ్లకు తెలుసునని.. అందుకే వాళ్లు తన నియోజకవర్గంలో ఏమైనా చేయొచ్చుననే ఆలోచన పెట్టుకున్నారని అన్నారు. ఇవాళ తాను ప్రధానమంత్రి మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్‌లను చూసి బీజేపీలో ఉన్నానని లేకపోతే ఎప్పుడో పార్టీని వీడి వెళ్లిపోయేవాడినని చెప్పారు. తనకు మొదటి పార్టీ టీడీపీ అని, చివరిది భారతీయ జనతా పార్టీ అని.. ఇది తన నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. పార్టీని వీడానంటే ఇక తాను రాజకీయాలను వదిలివేస్తాను తప్ప.. వేరే పార్టీలో చేరనని తెలిపారు. పార్టీలో తనను వేధించే వారిని కూడా వదిలిపెట్టనని ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు. కాగా తెలంగాణ అభివృద్ధికి కేంద్ర నుంచి కావాల్సిన నిధుల అంశంలో బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెవులు లేని వాళ్లని అడిగితే ఏం లాభం..? చెవులు ఉన్న వాళ్లని అడిగితేనే ఫలితం ఉంటుందని.. సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. ప్రధాని మోదీ మంచి నాయకుడని, సీఎం ప్రధానిని కలిస్తే పనులు జరుగుతాయని సూచించారు. అలాగే, సీఎం రేవంత్‌నుద్దేశించి రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రాష్ట్రంలో నోరు మూసుకుని ఉంటారని, కానీ ఢిల్లీకి వెళ్లిన తర్వాత నోరు ఎత్తుతారని, ఆ సీక్రెట్ ఏంటో చెప్పాలని కోరారు. 'రేవంత్‌రెడ్డి గారు మొన్న మీరు కిషన్‌రెడ్డి ముందే ఉన్నారు కదా.. అప్పుడు కిషన్ రెడ్డిని ఎందుకు అడగలేదు.. ఈ రోజు ఢిల్లీలో మీరు ఎందుకని బీజేపీ, కేంద్ర మంత్రిపై విమర్శలు చేస్తున్నారు?' అని రాజాసింగ్ ప్రశ్నించారు. ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని కలిసి విషయాన్ని ఆయన ముందు ఉంచాలని సూచించారు. అలాగే, 2014 నుంచి ఇప్పటివరకు తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు వచ్చాయనే దానిపై ఓ జాబితాను తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com